POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
మార్చి 2023
వెల – ₹ 10.00

సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 40 సంచిక: 11

పూజ్య గురు దంపతుల కళ్యాణ మహోత్సవము
(6-3-2023)

శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము, గుమ్మళంపాడు గ్రామంలో జరుగు పూజ్యశ్రీ అలివేలుమంగా సమేత భరద్వాజ మహారాజ్ లీలా కళ్యాణ మహోత్సవ వేడుకలు.
మార్చి 5, 6 మరియు 7 తేదీలు - 2023

కార్యక్రమ వివరములు

మార్చి 5, 2023, ఆదివారం

ఉదయం కార్యక్రమములు

గం. 5.30 – పూజ్యశ్రీ మాస్టరుగారికి మరియు పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపు సేవ,
విడిది గృహమునకు ఆహ్వానించుట.
గం. 6.00 – శ్రీ సాయిబాబా కాకడ ఆరతి.
గం. 7.30 – పూజ్యశ్రీ అమ్మగారి సమాధి అభిషేకము, ప్రత్యేక అలంకరణ.
గం. 8.30 – అల్పాహార నైవేద్య సేవ.
గం. 9.00 – ప్రసాద వితరణ.
గం. 9.30 – పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారిని వరునిగా, పూజ్యశ్రీ అమ్మగారిని వధువుగా చేయుట,
వారి పాదుకలకు పంచామృతాలతో అభిషేకము,
– వేద పారాయణ,
– వస్త్ర సమర్పణ, మంగళ హారతులు.
గం. 12.00 – మధ్యాహ్న ఆరతి.
గం. 12.30 – మహా నివేదన,
తదనంతరము ప్రసాద వితరణ.

సాయంకాల కార్యక్రమములు

గం 4.00 – పూజ్యశ్రీ సాయిబాబాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికి, పూజ్యశ్రీ అమ్మగారికి మరియు మహాత్ములకు
కాఫీ నివేదన.
గం 4.30 – పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్, పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ ల ఎదురుకోలు మహోత్సవము,
వరపూజ, లగ్నపత్రిక.
గం. 6.30 – 'శ్రీ నళినీప్రియ కూచిపూడి నృత్య నికేతన్', ఒంగోలు వారిచే 'శ్రీ శిరిడీ సాయి దివ్య చరితం'
నృత్య రూపకం ప్రదర్శన.
గం. 9.00 – శేజ్ హారతి.
గం. 9.30 – ప్రసాద వితరణ.

పసి పిల్లలకు చదువులెలా నేర్పాలి?

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఎప్పుడూ ఏదో ఒక చింతలో మునిగే మనమంతా బాల్యమొక్కటే ఎంతో మధురమైనదని అనుకొనే సమయాలు తప్పకుండా ప్రతివారి జీవితంలోనూ వస్తాయి. "Heaven lies in our infancy" అన్న ఆంగ్ల కవి వాక్యం మనందరి వ్యధాకలిత హృదయాల మాటున ప్రతిధ్వనిస్తూంటుంది.

ఏ చింతలూ లేని బాల్యం పూర్ణంగా గడిపే బంగారు అవకాశాన్ని తమ పిల్లలకు పూర్తిగా ఇవ్వాలని ప్రతి తల్లికి, తండ్రికి వుంటుంది. కాని కాలక్రమేణా కలిధర్మం దానిని గూడ కబళిస్తోంది. దేశకాల పరిస్థితుల ప్రభావంవలన బిడ్డలు పోటీ మీద సాటివారి పిల్లలకంటే త్వరగా అధిక విద్యావంతు లైతేగాని సుఖవంతమైన ఉన్నతోద్యోగులు కాలేరన్న ఆతురతతో పోటీలు పడి పిల్లలకు ప్రైవేట్లు పెట్టించేవారు కొందరైతే, ఎంతైనా ఖర్చుచేసి తీవ్ర క్రమశిక్షణతో విద్యను గరపే స్కూళ్ళు, కాన్వెంట్లలో చేర్చేవారు మరికొందరు. మొత్తానికి అందరి పిల్లలకూ హాయిగా ఆడుకొనే కాలం కరువై పోతోంది. అది పెద్ద వారి దృష్టిలో శిక్షణ అయితే కావచ్చేమోగాని పిల్లల దృష్టిలో శిక్షే! చింతల మాలగా తయారైన జీవితవలయంలో బాల్యంగూడ యిమిడి పోతున్నది. అనాదిగా ప్రకృతి సౌందర్యానికీ, కవుల కావ్యాలకూ, మహర్షుల తాత్విక దర్శనానికి తమ గాంభీర్యాన్ని, రమణీయతనూ రంగరించిన అరణ్యాలలోని ప్రకృతి సంపద ఈనాడెలా అంతరించి పోతోందో అలానే మానవజీవితాని కంతటికీ మాధుర్యాన్ని పొందుపరచవలసిన బాల్యం ఆధునిక నాగరికతా ప్రభావంవల్ల వట్టిపోతోంది. ఈ విషయాన్ని కొంచెం వివరంగా పరిశీలిద్దాం.

బాల్యమనేది ఒక జీవి యొక్క మనస్సు, శరీరము సంపూర్ణంగా ఎదగని వయస్సు. మూడు, నాలుగేళ్ళ ప్రాయంలోని పిల్లవాడిని పాఠశాలలో అక్షరాలు దిద్దమన్నపుడు అసలు అక్షరాలెందుకు వ్రాయడం నేర్చుకోవాలో అర్థం చేసుకోలేడు. అంతేగాక టీచర్ వ్రాసిచూపిన అక్షరాన్ని అదేరీతిన దిద్దడానికి అవసరమైన అదుపు ఆ చిన్న పిల్లలకు తమ చేతి కండరాలపైన, నరాలపైన ఏర్పడదు. ఆధునిక మనస్తత్వశాస్త్రం ప్రకారం పెద్దలవలెనే పిల్లలు కూడ ఎందుకు చేయాలో అర్థంగాని పనిని మనస్ఫూర్తిగా చేయజాలరు. ఇది గమనించని ఉపాధ్యాయులు పిల్లలను దండిస్తారు. అంతటితో ఆ పసిమనస్సులకు చదువు మీద విముఖత, భయమూ ఏర్పడతాయి. తాత్కాలికంగా గతిలేక పిల్లలు పాఠాలు శ్రద్ధగా చదివినట్లు కనిపించినా అది కృత్రిమమూ, బాహ్యాడంబరము మాత్రమే! అలా తమ కిష్టం లేని బడికి విధిగా వెళ్ళమని నిర్బంధించే తల్లిదండ్రులు తమపై ప్రేమలేని పరమ కిరాతకులుగా కనిపిస్తారు. ఎదుగుతున్న పిల్లల మనస్సులలో అలముకుంటున్న విద్యపట్ల విముఖత, క్రమంగా తల్లిదండ్రుల పట్ల సమాజంపట్ల తిరుగుబాటు ధోరణిగా, ఒక విధమైన

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:40 మార్చి-2023 సంచిక:11

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

విషయ సూచిక

01.	పసి పిల్లలకు చదువులెలా నేర్పాలి?	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	03
02.	పరిప్రశ్న	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	06
03.	ధర్మ స్వరూపుడు	పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ	07
04.	మాతృదేవి స్మృతులు	శ్రీమతి పిడూరి రాధ	10
05.	పూజ్య గురుదంపతుల కల్యాణ మహోత్సవం!!	శ్రీమతి టి. పద్మావతి	12
06.	వార్తాలాపము	శ్రీమతి అడిదం వేదవతి	13
07.	శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు	శ్రీమతి శ్రీదేవి	16
08.	దివ్య సన్నిధానములో బ్రహ్మానుభూతి పర్వదిన వేడుకలు !!	శ్రీమతి టి. పద్మావతి	18
09.	మార్గం చూపిన మహనీయుడు	శ్రీమతి సరోజనమ్మ	20
10.	మరికొందరు భక్తులు	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	22
11.	ద్వారకామాయి అనుభవమండపము	శ్రీమతి న్యాయపతి రేవతి	25
12.	ఆచార్యుని అద్భుత లీలలు	శ్రీ రావూరు గోపాల్	27

చిరునామా
Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
www.saibharadwaja.org
www.saimasterforums.org

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి	:	రూ. 10-00
సంవత్సర చందా	:	రూ. 100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

అణచి పెట్టుకున్న పగగా మారుతుంది. యుక్త వయస్సు సమీపించిన కొద్దీ వీరు విధిగా వారి కుటుంబాలకూ, సమాజానికి తలనొప్పిగా పరిణమిస్తారు. ధర్మమూ, సాటి ప్రాణిపట్ల అవగాహనే లేని అమానుషత్వమే జీవితంలో నెగ్గగలవన్న వైఖరి వారిలో గూడుకట్టుకుంటుంది. అందుకే వారు స్వతంత్రులయ్యే సమయానికి తల్లిదండ్రులను కుటుంబాన్ని హృదయపూర్వకంగా ప్రేమించి ఆదరించలేని స్థితికి దిగజారుతారు. బాల్యంలో శరీరము అతి శీఘ్రంగా ఎదిగినట్లే పిల్లల మనస్సుకూడ వికసింపగల సామర్థ్యాన్ని కలిగివుంటుంది. అందుకే వారు అంతులేకుండా పెద్దలపై అనేక విషయాలను గూర్చిన ప్రశ్నలతో దాడి చేస్తారు. వారి మనసు నెరిగి తగురీతిన చెప్పగలవారే దొరకాలిగాని ఆ వయస్సులో నేర్చినంత విద్యను మరే వయస్సులోనూ నేర్వలేరనే చెప్పాలి. ఆ దశలో సరియైన ప్రోత్సాహాన్ని పొందగల అదృష్టవంతుల మనస్సు ఆ వయసులో పొందిన వికాసాన్ని, తెలివితేటలను యుక్తవయస్సులో ఉన్నత విద్యలో ఉపయోగించి నిజమైన ప్రతిభావంతులవుతారు. సహజంగా అంత తీవ్రజిజ్ఞాస కలిగియుండవలసిన పిల్లలు విజ్ఞానాన్నార్జించే విద్యావ్యవస్థపట్ల ఈనాడింత తీవ్ర విముఖత కనపరుస్తున్నారంటే ప్రాథమిక విద్యావిధానంలోని లోపమే అది. పిల్లలు భయభక్తులతో చదువుకుంటున్నట్లు కనిపించినప్పటికీ విద్యపట్ల ఆసక్తిని తదితరులపట్ల ప్రేమనూ, సమాజంపట్ల మానవత్వాన్ని కోల్పోయిన వింత జీవులుగ మారుతున్నారు.

ప్రత్యేకంగా పాఠాలు చెబుతున్నట్లు తెలియనీయకుండా విద్యను ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా పిల్లలకు అందించగల విధానం కావాలి.

ప్రేమ, బాధ్యతలతో రంగరించిన క్రమశిక్షణను వ్యక్తిగతమైన శ్రద్ధతో పిల్లల కందించగల నైపుణ్యం కావాలి.

వారి పసినరాలపైన, చేతికండరాలపైన వారికి అదుపు లభించే లోపల ఆటల, పాటల, పద్యాల రూపంలో, కబుర్ల ద్వారానూ పరిజ్ఞానాన్నందించాలి.

సుమారు 5,6 సంవత్సరాలలో రచన యొక్క ఆవశ్యకతను వారికి తెలియచెప్పాకనే వ్రాయడం నేర్పాలి.

అప్పటికే ఆహ్లాదంగా బొమ్మలు గీయడంలో కొంత నైపుణ్యమార్జించిన పిల్లలు ఎట్టి శ్రమలేకనే చక్కగా వ్రాయగలుగుతారు.

విద్యాబోధన కేవలం వృత్తిగాకాని, మతప్రచార లక్ష్యంతో గాని చేసేవారికి ఇది సాధ్యం కాదు.

ఆదర్శమైన పాఠశాల ముఖ్యంగా రెండు జాగ్రత్తలను తీసుకోవాలి. ఒకటి, ఒక వంక విద్యార్థుల తల్లిదండ్రులకు పిల్లల పెంపకాన్ని గూర్చిన కొన్ని సూక్ష్మాలను తెలియపరచాలి. రెండు, మరొక వంక పిల్లల వ్యక్తిగతమైన మనస్తత్వానికి అనుగుణంగా ఆట పాటల ద్వారా వారికి సహజంగా బడి పట్ల వుండే భయాన్ని, విముఖతను తొలగించాలి. దండన బదులు శిక్షణ నివ్వటమంటే ఏమిటో తెలియాలి.

పాఠాలు నేర్పడంలో ఆ పసి మనస్సుల కెలాంటి సమస్య లెదురౌతాయో సూక్ష్మంగా గ్రహించి వాటిని తొలగించగల వ్యక్తిగతమైన శ్రద్ధ తీసుకోగల నైతిక బలము పాఠశాల నిర్వాహకుల కుండాలి. పిల్లలపై నైతిక మతాచారాలను, సాంప్రదాయాలను బలవంతాన రుద్దడం తగదు. అలానే పాఠ్యాంశాలను యాంత్రికంగా జ్ఞాపకముంచుకొనేలా చేయడమే కర్తవ్యంకాదు. వీటి వలన సకాలంలో వీటికి వ్యతిరేకమైన ప్రభావాలు సోకగానే ప్రతీకారంగా మనం వుద్దేశించిన దానికి వ్యతిరేకమైన వైఖరిని పిల్లలు ఎదిగిన తరువాత అవలంభిస్తారు. అలా పాఠ్యాంశాల విషయంలో వారిలో సృజనాత్మకత, సహజమైన ఉత్సుకత నశిస్తాయి. ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం నిర్దుష్టంగా మానవ జీవిత లక్ష్యాన్నర్థం చేసికొన్న వారికే సాధ్యమవుతుంది. విద్యాబోధన కేవలం వృత్తిగాగాని, మత ప్రచార లక్ష్యంతో గాని చేసేవారికి ఇది సాధ్యం కాదు.

బిడ్డలను ఈ దేశంలోని వాతావరణానికి, సాంఘిక పరిస్థితులకు అనుగుణమయిన వస్త్రధారణ (Uniform) దగ్గర నుండి ఆ పసి మనసులకు నిత్యమూ విద్యాబోధన మధ్యలో అందించవలసిన పోషక పానీయాల వరకు నిశితమైన అవగాహనకలిగి వుండాలి. ముప్పై మంది బాలబాలికల కంటే ఎక్కువ మందిని ఒక ఉపాధ్యాయుని కప్పచెప్పడంలో యివేవీ సాధ్య పడవు. "Penny Wise Pound Foolish" అన్న నానుడి ననుసరించి తాత్కాలికమైన సౌలభ్యాన్నాసించి పిల్లల యావజ్జీవిత శ్రేయస్సును, తల్లిదండ్రుల సుఖశాంతులను బలి చేసినట్లే అవుతుంది. వాస్తవానికి యింత బాధ్యతను గుర్తించి శ్రద్ధతో వహించగల వారికప్పచెప్పడం కంటే చక్కని విద్యారంభం మరొక్కటి వుండజాలదు. సహజంగా పిల్లలలో వుండే జిజ్ఞాసను సంతోషాన్ని పెంపొందించేదే నిజమైన విద్య. ●

పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రశ్న :- మన పెద్దలు ప్రతీవారినీ పుత్ర పౌత్రాభివృద్ధిరస్తు' అని ఆశీర్వదిస్తారు. ప్రాచీనులు పూజలలోని సంకల్పంలో గూడా అలానే చెప్పారు. అంటే బిడ్డలు - అందులో మగ పిల్లలు -ఎంత ఎక్కువ మంది కల్గితే అంత సంతోషమన్న భావం వ్యక్తమవుతుంది. కాని నేటి సాంఘిక, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అది వాంఛనీయంగాదు. ఇప్పుడు సంతానం విషయంలో మన దృష్టి ఎలా వుండాలి?

జవాబు :- శృతులు మానవుడు సంతానాన్ని బడసి పితృఋణం తీర్చాలన్నాయి. అయితే మీరు తలచినట్లు బహు సంఖ్యలో బిడ్డలుండాలని వారు చెప్పలేదు. మన తదనంతరము మనకు పిండోదకాలర్పించడానికి కొడుకులు లేకుంటే పుణ్యలోకాలు దక్కవని వారు చెప్పిన మాటలలో ఎంతో లోతైన భావమున్నది.

తమ జాతి, వంశము నిలవాలన్నది జీవులన్నింటికీ ప్రకృతి సిద్ధంగా వున్న కోరిక. యోచనాశక్తి గల మానవులు తమ సంతానం ఉత్తమంగానూ, పవిత్రంగానూ రూపొంది వంశానికి కీర్తి, పుణ్యము గడించాలని ఆశించడం సహజం. అది స్వార్థంగాదా? పైగా వారు కీర్తి గడించినందువలన గతించిన పెద్దలు పై లోకాలలో పొందేదేమిటి? ఉత్తమవంశంలో యోగ భ్రష్టులైన ఉత్తమ సాధకులు జన్మించి తమ యోగాన్ని కొనసాగించుకోవాలని వారి కోరిక. ఉత్తముడైన యోగి, జ్ఞాని, జ్ఞాన వైరాగ్యాలుగల సన్యాసి జన్మిస్తే కొన్ని తరాల పెద్దలు గూడ తరిస్తారని ఋషి వాక్యము. మానవాళికి గూడ ఎంతో మేలు జరుగుతుందిగదా! ఇలాంటి జగద్హితానికి దోహదం చేయటమే ప్రతి కుటుంబం యొక్క పవిత్ర కర్తవ్యమని పెద్దలభావం. అదే జన్మసార్థకత. ఇలాంటి వంశోద్ధారకులైన బిడ్డల జననమే ఆశీస్సులతో సూచించబడింది గాని కేవలం కోడిపిల్లలలాగా సంఖ్య ప్రధానమని తలచరాదు. కారణం బహుళ సంతతి దరిద్ర లక్షణంగా పలుచోట్ల ప్రాచీన గ్రంథాలలో కన్పిస్తుంది.

అంతేగాదు పవిత్రమైన ధర్మాచరణలేని బిడ్డల వలన పితృదేవతలు సైతం అధోగతి పాలవుతారని, అట్టివారు కేవలం లాంఛనంగా శ్రాద్ధాది కర్మలు చేసినా వ్యర్థమని ధర్మశాస్త్ర గ్రంథాలు చెబుతున్నాయి. భగవంతునియందు నిజమైన భక్తి లేనివాడికి కర్మాచరణ ఫలితం శూన్యమని ధర్మశాస్త్రాలన్నీ చెబుతున్నాయి. కనుక కల్గిన పరిమితమైన కొద్దిమంది సంతతి ఉత్తమ సంస్కారవంతులు గావాలన్నది పెద్దల ఆశీర్వచనానికి అర్థము. అంతేగాదు, ఇద్దరు లేక ముగ్గురు బిడ్డలు కలిగాక దంపతులు సోదరీ సోదరులవలె జీవించగల్గడం మానవ జీవితాదర్శంగా చెప్పబడ్డది. కారణం పరిమిత సంఖ్యలో బిడ్డలుంటే తల్లిదండ్రులు వారి విద్య, పెంపకాలలో తగు శ్రద్ధ తీసుకొని వారిని సంస్కరించడం సాధ్యమౌతుంది. ఈ విషయాన్నే శ్రీ రామకృష్ణ పరమహంస ఎన్నో సందర్భాలలో సూచించారు.●

(ఏప్రిల్ 2013 సాయిబాబా మాసపత్రిక నుండి)

ధర్మ స్వరూపుడు

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

"రామో విగ్రహవాన్ ధర్మః" అన్నారు పెద్దలు. అంటే శ్రీరాముడు ధర్మస్వరూపుడు అని అర్థం. అంతేగాదు. ఆయన పితృవాక్యపరిపాలనా దక్షుడు, ఏకపత్నీవ్రతుడు, ఆశ్రిత రక్షకుడు, భక్తజన ప్రియుడు, దుష్ట సంహారకుడు, గురుసేవావ్రతుడు, పరమ వైరాగ్యమూర్తి – ఇలా ఎన్నో సద్గుణాలు శ్రీరామునిలో నిండివున్నాయి. శ్రీరాముడు తనను తాను మానవునిగానే భావిస్తున్నానని చెప్పినప్పటికీ (ఆత్మానం మానుషం మన్యే) ఆయన మానవాతీతుడనీ, అవతార పురుషుడనీ ఆయన గుణాలు, చర్యలు మనకు తెలియజేస్తాయి.

ఎవరైనా ధర్మంగా వుంటే శ్రీరాముడంతటి ధర్మ తత్పరుడని, పరస్త్రీవైపు కన్నెత్తి చూడనివారిని శ్రీరాముడంతటి సౌశీల్యుడని, మంచి గుణాలు కలవాడిని, 'రాముడు మంచి బాలుడు' అన్నట్లు వుంటాడనీ – ఇలా మానవులలో వున్న సద్గుణాలను శ్రీరాముని గుణాలతో పోల్చి చెప్పడం లోకంలో పరిపాటి.

పరిపూర్ణ మానవుడే రాముడని, మానవత్వం అంటే ఏమిటో, పరిపూర్ణ మానవుడు ఎలా వుంటాడో తెలియజెప్పడానికి భగవంతుడు అటువంటి అవతారం ధరించాడనీ పెద్దలు అంటారు.

పూజ్యశ్రీ మాస్టరుగారిలో శ్రీరాముని దివ్యగుణాలను మనం దర్శించవచ్చు. ఆయన ధర్మ స్వరూపుడుగాను, పరిపూర్ణ మానవునిగానూ, ఆయనను నిశితంగా గమనించినవారికి దర్శనమిస్తారు.

శ్రీరాముని వలెనే ఆయన తమను తాము సామాన్య మానవునిగానే తలచేవారు. ప్రవర్తించేవారు. అయినా ఆయనలోని సద్గుణాలు ఆయనను మనం పరమ పూజ్యులుగా భావించడానికి నిదర్శనంగా నిలుస్తాయి. పూజ్యశ్రీ మాస్టరుగారిలో వున్న దివ్యగుణాలను మచ్చుకు కొన్నింటిని యిప్పుడు మనం స్మరించుకుందాము.

పూజ్యశ్రీ మాస్టరుగారు సృష్టి తత్త్వము, జనన మరణాల తత్త్వము, మానవ జీవిత లక్ష్యము మొ॥న వాటి గురించి తీవ్ర చింతన చేసి తీవ్ర వైరాగ్యమూర్తియైనారు. ఆయనకు తత్త్వచింతన పట్ల తప్ప మరి అన్యమైనవాటి పట్ల ఆసక్తి లేదు. ఆ కారణంగా ఆయన వైవాహిక జీవితం పట్ల విముఖత చెంది వివాహం చేసుకోకూడదని నిర్ణయించుకున్నారు.

తండ్రిగారైన శ్రీమాన్ అనంతాచార్యులవారు ఆయనను గృహస్థాశ్రమం స్వీకరించవలసిందిగా ఎంతగా చెప్పినా పూజ్యశ్రీ మాస్టరుగారు తమ ఆశయాలను తండ్రిగారికి వివరించి తమ నిర్ణయాన్ని ఆయన అంగీకరించేటట్లుగా ఆయనను సమాధానపరచారు.

శ్రీమాన్ అనంతాచార్యులవారు కుమారుడు చెప్పిన సహేతుకమైన కారణాలపట్ల సంతోషం వ్యక్తపరచి ఆయన సంకల్పాన్నే అంగీకరించినప్పటికీ తమ కుమారుడు గృహస్థుగా జీవించాలనే ఆకాంక్ష ఆయనకు లేకపోలేదు. పూజ్యశ్రీ మాస్టరుగారు సర్వమూ త్యజించి సన్యాసాశ్రమం స్వీకరిస్తాడేమోనని, తపస్సుకై అరణ్యాలకు వెళ్ళిపోతాడేమోననీ ఆయన ఆందోళన చెందుతుండేవారు. ఒకసారి ఆయన తమ బాధను పూజ్యశ్రీ మాస్టరుగారి వద్ద వ్యక్తపరచి, కనీసం తాము జీవించి వున్నంతవరకైనా

సన్యసించనని, ఎక్కడకు వెళ్ళనని వాగ్దానం కోరారు. పూజ్యశ్రీ మాస్టరుగారికి అది అంగీకారమైన విషయం కానప్పటికీ తండ్రిగారి ఆవేదనను అర్థం చేసుకుని ఆయన కోరికను తీర్చడం తమ ధర్మమని తలచి అంగీకరించారు. ఆయన సంతోషంగా పితృవాక్యపరిపాలన చేసారు.

శ్రీరాముడు అనేకమంది ఋషులను సేవించారు. వారి ఆశీస్సులను పొందారు. వారందరూ శ్రీరాముని అవతారపురుషుడని కీర్తించారు.

అలాగే పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతోమంది మహాత్ములను దర్శించారు. వారి ఆశీస్సులను పొందారు. వారి చేతనే ఆయన మహాత్ముడని కొనియాడబడ్డారు.

యజ్ఞరక్షణార్థమై శ్రీరాముని తమ వెంట తీసుకువెళ్ళిన విశ్వామిత్రుడు యజ్ఞానంతరం మిథిలా నగరానికి గూడ తమ వెంట తీసుకువెళ్ళాడు. అక్కడ సీతాస్వయంవరం జరుగుతున్నది. ఎందరో రాజులు ఆహ్వానితులై స్వయంవరానికి హాజరైనారు. అయితే శ్రీరామునికి మాత్రం స్వయంవరం మీద ఆసక్తి లేదు. ఆ రాజులందరూ శివ ధనుస్సును ఎక్కుపెట్టడానికి ప్రయత్నించి విఫలులవుతున్నారు. తాను శక్తిమంతుడనని తెలిసినప్పటికీ శ్రీరామునికి మాత్రం అట్టి ఆలోచనే రాలేదు. అందుకనే అట్టి ప్రయత్నం చేయడానికి పూనుకోలేదు. కేవలం విశ్వామిత్రుని అజ్ఞమేరకు మాత్రమే ఆయన శివధనుస్సును ఎక్కుపెట్టడానికి సంసిద్ధుడైనాడు.

అలాగే పూజ్యశ్రీ మాస్టరుగారు గూడ వివాహం చేసుకోమని ఎంతోమంది ఆయనకు ఎంతగానో చెప్పినప్పటికీ ఆయన వివాహం పట్ల తమ విముఖతనే వ్యక్తం చేసారు. చివరకు తమ గురువైన శ్రీ శిరిడీ సాయినాథుని ఆదేశానుసారం మాత్రమే వివాహం చేసుకున్నారు.

ఆయన తమ తల్లిదండ్రులపట్ల, భార్యాబిడ్డలపట్ల, బంధుమిత్రులపట్ల తమ ధర్మాన్ని ఎంతగా నిర్వర్తించారో ఆయనతో పరిచయమున్నవారందరికీ విదితమే.

ఆయన ధర్మాన్ని ఎన్నడూ తప్పలేదు. బ్రహ్మచారిగా వున్నప్పుడు ఖచ్చితమైన బ్రహ్మచర్యాన్ని పాటించారు. గృహస్థుగా వున్నప్పుడు గృహస్థధర్మాన్ని నిర్దుష్టంగా పాటించారు. గృహస్థు ఎలా వుండాలో, బ్రహ్మచారి ఎలా వుండాలో ఆయన తమ ఆచరణ ద్వారా తెలియజేసారు.

అంతేగాదు, ఆయన నేటి సామాజిక వ్యవస్థలోను, ఆధ్యాత్మిక వ్యవస్థలోనూ జరుగుతున్న ధర్మ భ్రష్టతను ఎదుర్కొన్నారు.

హేతు, నాస్తికవాదుల వలన భగవంతుని ఆస్తిక్యాన్ని శంకించి ధర్మభ్రష్టమవుతున్న సమాజాన్ని సరిదిద్దడానికి ఆయన హేతు నాస్తికవాదులను ఢీకొన్నారు. తమ వాదనాపటిమతో వారిని ఎదుర్కొనడమేగాక హేతు, నాస్తిక వాదాలకు సవాలుగా ఆయన 'ఏది నిజం?', 'విజ్ఞాన వీచికలు' అన్న గ్రంథాలను రచించి లోకానికి అందించారు. అవి చదివినవారెవరైనా

భగవంతుని ఆస్తిక్యాన్ని శంకించరు.

కలి ప్రభావము వలన, పరదేశీయుల పాలన వలన క్షీణించిపోయిన మన సంస్కృతిని పునరుద్ధరించడానికి ఆయన ప్రస్తుతం మన వ్యవస్థలో వున్న లోటుపాట్లను సవరించుకోవడానికి ఎన్నో సూచనలను యిచ్చారు.

ఆధ్యాత్మికత పేరిట ప్రజలను మోసగిస్తున్న నకిలీ గురువుల, స్వాముల బారి నుంచి ప్రజలను రక్షించడానికి ఆయన నిజమైన ఆధ్యాత్మికత గూర్చి, నిజమైన ఆధ్యాత్మికవేత్తలు, మహనీయుల గూర్చి తెలియజేస్తూ గ్రంథాలు రచించారు. ఉపన్యాసాలు యిచ్చారు. అట్టివారిని కొందరిని పరిచయం చేసారు గూడ.

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీ ఆనందమయిమాత దర్శనార్థమై నైమిశారణ్యానికి వెళ్ళారు. అక్కడ భాగవత ప్రవచనం చేస్తున్న శ్రీ అఖండానంద సరస్వతి అను మహనీయునితో ఆయన ధర్మప్రతిష్ఠాపన విషయమై ప్రశ్నించారు. అప్పుడు అఖండానంద సరస్వతి పూజ్యశ్రీ మాస్టరుగారితో, "ఇప్పుడు నువ్వు, నేనూ చేస్తున్న పని అదే గదా! (అంటే ధర్మప్రతిష్ఠాపనే గదా!)" అన్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ధర్మ తత్పరుడనడానికి గాని, ధర్మ ప్రతిష్ఠాపకుడు అనడానికి గానీ ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి?

ఎట్టి పరిస్థితిలోనూ చలించని నిశ్చింత పూజ్యశ్రీ మాస్టరుగారి స్వంతం. అయోధ్యరాజ్య పట్టాభిషేకానికి సంసిద్ధుడై తండ్రి వద్దకు వెళ్ళిన శ్రీరామునికి అరణ్యానికి వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది. అయినా ఆయనలో ఎటువంటి చింతా కనిపించలేదు. ఏ విధమైన ధీరత్వంతో లోపలికి వెళ్ళాడో అదే విధంగానే అంతఃపురంలో నుంచి బయటకు వచ్చాడు. ఆయన ముఖంలో ఎటువంటి మార్పు కనిపించలేదట!

అలాగే పూజ్యశ్రీ మాస్టరుగారు 12 సం॥ల పాటు విద్యానగర్ లో సత్సంగాలు చేసారు. సాయిబాబా గూర్చి ప్రచారం చేసారు. అక్కడ సాయి మందిరాన్ని నిర్మింపజేసారు. ఆ వెంటనే అక్కడనుంచి ఆయన వెళ్ళిపోవలసిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడు ఆయన నిశ్చింతగా అక్కడనుంచి వచ్చేసారు. తామింత శ్రమపడి మందిర నిర్మాణ కార్యక్రమం జరిపించానని గాని, అక్కడ అటువంటి పరిస్థితులు కల్పించినవారిపై కినుక వహించడంగానీ, ఆయన చేయలేదు. అంతకుముందు ఎలా వున్నారో, ఆ తర్వాతగూడ అలాగే వున్నారు.

సచ్ఛీలత, సౌభ్రాతృత్వము, దయ, క్షమ, శాంతి, ఆశ్రిత వత్సలత, ఆర్తత్రాణ పరాయణత, దానము మొ॥న వన్నీ పూజ్యశ్రీ మాస్టరుగారికి పెట్టని భూషణాలు. ఇవన్నీ అతిశయోక్తులేమోనని కొందరు అనుకోవచ్చు. "ఆయన రాముడంతటి వాడా?" అని గూడ కొందరికి అనిపించవచ్చు.

చివరగా అందుకు ఒక ఉదాహరణ:

ఒంగోలులోని జె.వి. సుబ్బయ్యగారింట్లో ఒక తల్లీ కొడుకులు అద్దెకు వుంటుండేవారు. తల్లి చాలా వృద్ధురాలు. ఆమెకు 80 సం॥లకుపైనే వయస్సు. ఆమెను అవ్వగారు అని అందరూ పిలుస్తుండేవారు. ఆమె తన చిన్నతనంలోనే ఒక గురువు వద్ద శ్రీరామ తారక మంత్రాన్ని ఉపదేశంగా పొంది, అప్పటినుంచి దీక్షతో, భక్తితో శ్రీరాముని సేవిస్తుండేది. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు జె.వి.సుబ్బయ్యగారి ఇంటికి వచ్చారు. అప్పుడామె ఆయనను దర్శించుకున్నది. ఆ తర్వాత ఒకరోజున తెల్లవారురుఝామున పూజ్యశ్రీ మాస్టరుగారు ఆమెకు స్వప్నంలో దర్శనమిచ్చారు. స్వప్నంలోనే ఆమె పూజ్యశ్రీ మాస్టరుగారి పాదాలకు నమస్కారం చేసుకుని లేచేసరికి ఆయన శ్రీ కోదండ రామునిగా దర్శనమిచ్చారు. కొద్దిసేపటి తర్వాత ఆయన మళ్ళీ మామూలుగా పూజ్యశ్రీ మాస్టరుగారి లాగానే కనిపించారు. ఆయన నవ్వుతూ ఆమెతో, "ఏమ్మా! బాగున్నావా?" అని పలకరించారు. ఆమె ఆనందంతో, "నీవే నా రామయ్యతండ్రివి!" అంటూ ఆనందభాష్పాలు నిండిన కన్నులతో ఆయనను చూస్తుండగా మళ్ళీ ఆమెకు ఒక్క క్షణంకాలంపాటు అదే శ్రీరామ దర్శనమైంది! ఇది చాలు మనకు – ఆయన ఎవరో తెలియడానికి!!

ఈ కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా శ్రీ సాయినాథుని, పూజ్యశ్రీ మాస్టరుగారిని వారి యొక్క ఆశీస్సులు మనందరికీ ప్రసాదించమని, శ్రీరాముని యొక్క సద్గుణాలను మనమూ పెంపొందించుకునేలా చేయమని ప్రార్థిద్దాము. ఈ ఆరాధనా మహోత్సవ సందర్భంగా మరింత ఆరాధనతో వారిని సేవిద్దాము.

జై సాయి మాస్టర్!!

మాతృదేవి స్మృతులు

శ్రీమతి పిడూరి రాధ

పూజ్య శ్రీ అలివేలుమంగమ్మ-తల్లితో తన స్మృతులను అనుభవాలను, అనుభూతులను నాగోలు సత్సంగసభ్యురాలు శ్రీమతి రాధ ఈ విధంగా తెలియచేస్తున్నారు...

మా ఇంట్లో చిన్నప్పటినుండి పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాల పారాయణ జరుగుతుండటం వలన మాకు పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతో గొప్పవారనిపించేది. మేము తరచుగా ఒంగోలులో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళుతుండేవారము. పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకి ఎప్పుడు వెళ్లినా మనసుకు ఎంతో ఆనందంగా వుండేది. అంతకుమించి పూజ్యశ్రీ అమ్మగారి గురించి ఏమీ తెలిసేది కాదు. నేను వెళ్ళగానే, "బాగున్నావా? ఇంట్లో అందరూ ఎలా వున్నారు?" అన్న పలకరింపు చాలా ఆప్యాయంగా వుండేది. వారి ఇంట్లో చిన్న చిన్న సేవలు చేసుకుంటూ వుండేవారము.

ప్రమీల అప్పట్లో నా స్నేహితురాలు. ఇప్పుడు మా ఆడపడుచు. మా యిద్దరికీ పూజ్యశ్రీ అమ్మగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి భిక్షకు వంట చేసే అవకాశం కొన్ని రోజులపాటు కలిగింది. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు ఏ పనైనా ఎలా చేసుకోవాలో చెప్పేవారు. "ప్రతి పనినీ స్మరణ చేసుకుంటూ బాబా పరంగా, పూజ్యశ్రీ మాస్టరుగారి పరంగా చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. ఉదాహరణకు వంటచేస్తుంటే పొయ్యి వెలిగించినపుడే, "బాబా మీకు నైవేద్యం పెట్టడానికే ఈ వంట చేస్తున్నాను. ఈ ప్రసాదం తినడంవల్ల మాకు మంచిబలము,ఆరోగ్యము,తెలివితేటలు ప్రసాదించు తండ్రీ!" అని నమస్కారం చేసుకోమనేవారు. 'బాబా మన ఇంట్లో వున్నారు!' అనే భావన పెట్టుకుని ఇల్లు శుభ్రంగా వుంచుకోవడం, ఆయనకు నైవేద్యం పెట్టడం, హారతులు యివ్వడం అలవాటు చేసుకోవాలని చెప్పేవారు.

ఒకసారి జిల్లెళ్ళమూడిలో ఆమె చేసిన సేవ గురించి పూజ్యశ్రీ అమ్మగారిని అడిగితే యిలా చెప్పారు: "అన్ని రకాల పనులూ చేశాను. కూలి పనులు, పొలం పనుల దగ్గరనుంచీ, ఒకటేమిటి?.. అన్ని పనులూ చేశాను. నేను అక్కడికి వెళ్ళినప్పుడు కొద్దిగా లావుగా వుండేదాన్ని. తరవాత బాగా సన్నబడిపోయి, అస్థిపంజరానికి చర్మం తొడిగినట్లు అయిపోయాను. నేను పచ్చని పసిమి. కానీ అక్కడి తాపీ పని వల్ల జుట్టు బాగా ఊడిపోయి బాగా నల్లబడిపోయాను. అయినా ఏమీ లెక్కచేసేదాన్ని కాదు. ఏ రోజైనా ఆరోగ్యం బాగోలేక కొద్దిగా మాత్రమే సేవ చేసుకుంటే, ఆరోజు, 'నేను ఏం సేవ చేశానని ప్రసాదం తీసుకోవడానికి?' అనిపించేది. ఏ పని చేస్తున్నా అమ్మ స్మరణ చేసుకుంటూ చేసేదాన్ని. అమ్మని విడిచి వుండలేకపోయేదాన్ని" అని చెప్పారు.

"జిల్లెళ్ళమూడిలో వున్నప్పుడు మాకు శ్రీసూక్తం నేర్పించడానికి ఒకాయన వచ్చేవారు. మేము కొంతమందిమి అమ్మ వుండే గదికి వెనకాల గదిలో కూర్చుని నేర్చుకునేవాళ్ళం. ఆయన శ్రీ సూక్తంలో ఒకొక్క వరస చెబుతుంటే, నేను పొల్లుపోకుండా అలాగే చెప్తూండేదాన్ని. ఇదంతా పక్క గదిలో వున్న అమ్మ విని, 'మంగ ఆయన దగ్గర నేర్చుకుంటున్నట్లు లేదు, ఇద్దరూ పోటాపోటీగా చెప్తున్నట్లు వుంది!' అనీ, నన్ను 'ఘనాపాటి' అనీ అనేవారు." ఇలా అప్పుడప్పుడూ

పూజ్యశ్రీ అమ్మగారు జిల్లెళ్ళమూడి విషయాలు చెప్పేవారు.

నాకు 2002లో రమేష్ గారితో వివాహం నిశ్చయం అయ్యింది. వాళ్ళది ఒంగోలు. నేను ఆ సమయంలో హైదరాబాదు చిక్కడపల్లిలో పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర సేవ చేసుకునేదాన్ని. "అమ్మగారూ! పెళ్ళైన తరవాత తరచూ మీ దగ్గరకి రాలేనేమో!" అని బాధపడుతుంటే, "లేదు, రాధ హైదరాబాదు వచ్చేస్తుంది!" అని పదే పదే అనేవారు. అలాగే మేము 2009వ సంవత్సరంలో నాగోలు వచ్చి పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో వుండిపోయాము! ఇది పూర్తిగా పూజ్యశ్రీ అమ్మగారి సర్వజ్ఞత్వానికి, నాపై వారికి వున్న అపార కరుణకి నిదర్శనం. నాకు పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర వున్న ప్రతి సేవ చేయాలనిపించేది. అలా సేవ చేస్తున్నట్లు కలలు కూడా వచ్చేవి. 'ఇలా కల వచ్చింది అమ్మగారూ!' అంటే ఆ సేవలు చేయడానికి నాకు అవకాశం యిచ్చేవారు.

మాకు పాప పుట్టిన తరువాత అప్పుడప్పుడూ పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్ళినప్పుడు ఎన్నో విషయాలు పూజ్యశ్రీ అమ్మగారితో చెప్పుకోవాలనిపించేది. తీరా అక్కడకి వెళ్ళాక మనసెంతో ప్రశాంతమై అన్నీ మర్చిపోయేదాన్ని. కానీ పూజ్యశ్రీ అమ్మగారే అన్ని విషయాలూ అడిగి తెలుసుకునేవారు. కొన్ని మౌనంగా వినేవారు, కొన్నిటికి "అలాగే" అనేవారు. అంతే! అవన్నీ ఎలా జరిగితే మంచిదో అలా జరిగిపోయేవి! తరవాత యివన్నీ పూజ్యశ్రీ అమ్మగారు చేసిన లీలలని నాకు అర్థమయ్యేది. అదే మాట నేను పూజ్యశ్రీ అమ్మగారితో అంటే, "అదేమీకాదు, బాబా, మాస్టరుగారు అలా చేస్తారులే!" అని నవ్వి వూరుకునేవారు.

సత్సంగాలలో పూజ్యశ్రీ అమ్మగారు చెప్పిన కొన్ని విషయాలు:

"ఇతరులకు మనం సహాయం చేసినప్పుడు, మరలా మనకు అవసరమైనప్పుడు వాళ్ళు సహాయం చేయకపోతే వాళ్లపై ద్వేషం రాకుండా వుండటానికి 'వాళ్ళే అసలు లేకపోతే మనం ఎలా వుండేవాళ్ళం?', అని ఆలోచించుకోవచ్చు. లేదా వాళ్ళు అలా ప్రవర్తించడం ఋణానుబంధం అనుకోవచ్చు. లేక 'మన పూర్వకర్మ వాళ్ళ చేత అలా ప్రవర్తింపచేసింది' అనుకోవచ్చు. అలా అనుకుంటే ఇతరులపట్ల మనకు ద్వేషం కలగదు" అని చెప్పారు.

"మనం ఏ ఆశ్రమానికైనా, మరెక్కడికైనా వెళ్ళినప్పుడు, ఏ లక్ష్యంతో అక్కడకి వెళ్ళామో గుర్తుపెట్టుకుంటూ, కాలాన్ని వృధా చేసుకోక, అక్కడి పద్ధతుల ప్రకారం పారాయణ, ధ్యానం చేసుకుని, కాసేపు కూర్చుని వెంటనే బయలుదేరాలి. ఎక్కువ కాలమున్నకొద్దీ మామూలు పరిస్థితుల మీదకు మన మనస్సు మళ్ళి, లక్ష్యాన్ని గుర్తుపెట్టుకోలేము" అని చెప్పారు.

ఒకావిడ పూజ్యశ్రీ అమ్మగారితో తన బాధను చెప్పుకోగా పూజ్యశ్రీ అమ్మగారు, పారాయణ చేయమని చెప్తూ, "మన కర్మ చాలా పెట్టుకొని, ఆయనను కొద్దిగా ప్రార్థిస్తే ఎట్లాగ? బాబాను ఎంత ఎక్కువగా ప్రార్థిస్తే అంత త్వరగా మనకు ఫలితం కనిపిస్తుంది. డాక్టర్ దగ్గరకు వెళ్ళినప్పుడు ఆయన యిచ్చిన మందును ఒకరోజు వేసుకుని ఆపితే రోగం తగ్గదు. కాబట్టి రోగం తగ్గేంతవరకు మనం మందు ఎలా వాడతామో, అలాగే మన సమస్య తీరేవరకు బాబాను ప్రార్థించాలి. మనల్ని ఆదుకునేవారు ఆయనకంటే యింకెవ్వరూ వుండరు" అని చెప్పారు.

ఇలా ఎన్నో మంచి విషయాలు చెప్పి, సేవలు ప్రసాదించి, వారి సన్నిధిలోనే వుండే జీవితాన్ని అనుగ్రహించిన పూజ్యశ్రీ అమ్మగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి అనేకానేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.●

పూజ్య గురుదంపతుల కల్యాణ మహోత్సవం!!

శ్రీమతి టి. పద్మావతి

కళ్యాణము చూడ రారండి,
పరమేశ్వరుని కళ్యాణము చూడరారండి,
కన్నవారికి విన్నవారికి
ఇహపరంబుల నొసగునట్టి,
మంగళప్రదమౌ
అలివేల్మంగాంబా భరద్వాజుల,
కళ్యాణము చూడారారండి....

అని, యావన్మందీ ఆనందోత్సాహాలతో అంతకు మించిన భక్తి శ్రద్ధలతో, ఎన్నో ప్రాంతాలలో ఈ కల్యాణ మహోత్సవాన్ని జరుపుకున్నారు. మనందరం ప్రతి సంవత్సరం జరుపుకునే శ్రీ సీతారాముల, శ్రీ శివపార్వతుల కళ్యాణం లాగే, మన గురుదంపతుల కల్యాణ మహోత్సవం కూడా ద్విగుణీకృత ఉత్సాహంతో ఒక సంవత్సరం కన్నా ఇంకొక సంవత్సరం అధిక సంఖ్యలో, అత్యధిక ప్రాంతాలలో జరుపుకుంటున్నారు.

కావలి, బాపట్ల, పామూరు, చీరాల, ఎలమర్రు ప్రాంతాల్లో విద్యానగర్ తపోవనంలో, ఒంగోలు పూజ్యశ్రీ మాస్టర్ గారి నిలయంలో, గుమ్మళంపాడు మాతృశ్రీ సన్నిధిలో,, హైదరాబాద్ నాగోలు మొదలగు అనేక ప్రాంతాలలో గురుదంపతుల కల్యాణ మహోత్సవం జరిగింది. ఇవి మాత్రమే కాక ఎంతోమంది తమ తమ గృహాలలో కూడా పూజ్య అలివేలుమంగా భరద్వాజుల కల్యాణ మహోత్సవాన్ని జరుపుకున్నారు.

తిథి ప్రకారం వారి వారి ప్రాంతాల్లో కళ్యాణమహోత్సవం జరుపుకోవడం మన ఆనవాయితీ. పూజ్యశ్రీ అమ్మగారు దేహధారులై వున్నప్పుడు, హైదరాబాద్ నాగోలు లో తిథిప్రకారం కల్యాణం రోజున సాధారణ పూజ చేసుకుని, మార్చి 6 వ తేదీన అన్నిప్రాంతాల సత్సంగ సభ్యులతో కలిసి విశేషంగా జరుపుకోవడం గత ఐదు సంవత్సరాలుగా జరుగుతోంది. ఈ సంవత్సరం నాగోలు సత్సంగసభ్యులు కూడా అందరి సత్సంగసభ్యులలాగే ఈ కల్యాణ మహోత్సవాన్ని 'గోటేటి ఫంక్షన్ హాల్' లో విశేషంగా జరుపుకున్నారు.

శ్రీమతి లయరాగిత ద్వారకనాథ్ గార్లు, పెళ్లికుమారుని తరపున, శ్రీమతి వేదవతి శ్రీకాంత్ గార్లు పెళ్లికుమార్తె తరపున పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. ముందుగా గురుదంపతుల వివాహానికి కారణమైన శ్రీ సాయినాథులవారు, అందంగా అలంకరించిన వేదికపై ఆసీనులయ్యారు. వారితో పాటు ఈ బృహత్కార్యానికి కారకులైన శ్రీ పాకలపాటి గురువుగారు, శ్రీ చీరాలస్వామి తో పాటు పూజ్యశ్రీ మాస్టరుగారు సూచించిన అనేక మంది మహాత్ములు వేదికనలంకరించారు. వేరే ప్రాంతాలనించి, జంటనగరాలనించి వచ్చిన సత్సంగసభ్యులు రెట్టించిన ఉత్సాహంతో, 'నేను సైతం' అంటూ ఈ మహదవకాశంలో పాలుపంచుకుంటున్నారు.

సుముహూర్త సమయం రానే వచ్చింది. విప్రులు వేదమంత్రాలు పఠిస్తూ, కల్యాణ మహోత్సవం జరిపిస్తూవుంటే, గగనమంతా వేదఘోషతో దద్దరిల్లగ భూమాత ఆనందంతో పులకరించి పునీతురాలైంది. భూమ్యాకాశాల పైన కిందా వున్న లోకాలన్నీ తరించాయి. ముప్పై మూడుకోట్ల దేవతలు, అనేకమంది మహాత్ములు, ఋషులు, మునులు భువిపై జరిగే మంగళప్రదమైన అలివేల్మంగాభరద్వాజుల కల్యాణ

మిగతా 19వ పేజీలో

వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

పదవ ప్రసంగము

జ్ఞానుల ప్రవర్తన కళ్యాణకరముగాను అనాసక్తి పూరితముగాను ఉంటుంది

స్వా॥ని॥ : అభ్యాసకాలంలో సన్యాసులకు జనుల సంసర్గము విఘ్నకరము. కాబట్టి గుప్తంగా వుండాలని వ్రాయబడింది. కానీ ఉన్నతదశలో కూడా (పూర్ణులయ్యాక కూడా) కొంతమంది గుప్తంగా వుంటారు. మరి కొందరు ప్రకటమవుతారు. దత్తాత్రేయులవారు అగ్నిని గురువుగా స్వీకరించి ఉపదేశం పొందారు. ఆ విషయంలో భాగవతంలో యిలా వుంది:

శ్లో॥ క్వచిచ్ఛన్నః క్వచిత్స్పష్టః
ఉపాస్యః శ్రేయ ఇచ్ఛతామ్।
భుంక్తే సర్వత్ర దాతౄణాం
దహన్ ప్రాగుత్తరాశుభమ్॥

భావం : అగ్ని కొన్నిచోట్ల ప్రకటమై వుంటుంది. మరి కొన్నిచోట్ల రహస్యంగా వుంటుంది. అగ్నిని కళ్యాణం కోసం (శుభం కోసం) ఉపాసించాలి. అగ్ని ఆహుతినిచ్చేవాడి భూత భవిష్యత్తులలోని పాపాలను భస్మం చేస్తుంది. యజ్ఞాహుతులను భుజిస్తుంది. అలానే ఆత్మ కల్యాణం కోసం ఉపాసనీయుడైన తత్వజ్ఞుడు ఒకప్పుడు రహస్యంగానుండి మరొకప్పుడు ప్రత్యక్షంగావుండి సేవించబడతాడు. భవిష్యత్తులోని పాపాలను దహించి వేస్తాడు. భోజనాది నియమాలను పాటించడు.

గుప్తంగా వుండటం, ప్రత్యక్షంగా వుండటం మాత్రమే కాదు. కొన్ని సమయాలలో వారి ప్రవర్తన వారి స్థానాన్ని బట్టి (పరిస్థితిని బట్టి) అనేక రకాలుగా కనిపిస్తుంది. కానీ వారికి దేని మీదా ఆసక్తి వుండదు.

ఈ విషయంలో శ్రీ ఆదిశంకరాచార్యులవారు ఇలా చెప్పారు:

క్వచిన్మూఢో విద్వాన్ క్వచిదపి మహారాజవిభవః ॥
క్వచిద్భ్రాన్తః సౌమ్యః క్వచిదజగరాచారకలితః।
క్వచిత్పాత్రీభూతః క్వచిదవమతః క్వాప్యవిదిత
శ్చరత్యేవం ప్రాజ్ఞః సతత పరమానన్ద ముదితః ॥

భావం: బ్రహ్మజ్ఞుడు అజ్ఞాని దృష్టిలో ఒక్కొక్కప్పుడు మూర్ఖుడిలాగా కనిపిస్తాడు. మరొకప్పుడు విద్వాంసుడి

లాగా వుంటాడు. ఒకప్పుడు రాజులు, ధనికులు అతనిని పూజిస్తారు అతడు మహారాజవైభవాన్ని అనుభవిస్తాడు. ఒకప్పుడు పిచ్చివాడిగా కనిపిస్తాడు. మరొకప్పుడు చాలా సాధువుగా కనిపిస్తాడు. ఒకప్పుడు అజగర వృత్తి (కొండచిలువ లాగా) దొరికిన దానితో తృప్తిపడటం అవలంబించి, శ్రమ పడకుండా లభించిన దానితో గడుపుకుంటాడు. జిజ్ఞాసువులు ఒక్కొక్కప్పుడు అతనిని సేవిస్తారు. దుష్టులు అతనిని అవమానిస్తారు. ఒకప్పుడు అతడు రహస్యంగా వుంటాడు. ఇలా అతని బాహ్య వ్యవహారములో అనేక రకాలుగా వుంటాడు. అయినా అతని అంతఃకరణములో నిరంతరము పరమానందం ఉప్పొంగుతూ వుంటుంది. అతడు సంతోషంగా వుంటాడు.

ఈ విషయంలో ఒక దృష్టాంతం వున్నది:

ఒక జ్ఞాని వుండేవాడు. అతనిని ప్రజలు చాలా గౌరవించేవారు. ఒకసారి రాజుకు ఆ జ్ఞానిని దర్శనం చేసుకోవాలనిపించి ఆయనను తన భవనానికి పిలిపించాడు. కొంతసేపు ఆయనను తన రాజ గజము మీద (ఏనుగు మీద) ఊరేగించి తీసుకొనివచ్చాడు. ప్రజలంతా ఆయన రాజవైభవాన్ని అనుభవిస్తున్నాడనుకున్నారు. తర్వాత ఆ జ్ఞాని మరొక దేశానికి వెళ్ళాడు. ఆయన ఒక గ్రామము దగ్గర ఉన్న ఒక చెట్టు కింద నిద్రిస్తూవున్నాడు. అక్కడ దొంగలు రాజభవనంలో దొంగతనం చేసి ధనము తీసుకెళ్లడానికి అవకాశం లేక ఈ జ్ఞాని పడుకొని వున్న చెట్టు కింద పడేసి వెళ్లారు. కాలి గుర్తులను బట్టి సైనికులు అక్కడికి వచ్చారు. వారు అక్కడ సామాను, ధనము పడివుండటం చూసి అతనిని పట్టుకొని మంత్రి దగ్గరకు తీసుకెళ్లారు. మంత్రి పూర్తిగా విషయం తెలుసుకోకుండానే ఆయనను గాడిద మీద కూర్చోబెట్టి 'రాజుగారి ఆజ్ఞ' అని చెప్పి అవమానించాడు. ఆ గ్రామంలో ఒక వర్తకుడు వుండేవాడు అతని మాతృదేశము ఇంతకుముందు ఆ జ్ఞాని గౌరవము పొందిన రాజ్యము. వర్తకుడు ఆయనను గుర్తుపట్టాడు. ఆయనకు కలిగిన దుస్థితికి వర్తకుడెంతో బాధపడి, దుఃఖాన్ని ఆపుకోలేక ఆయన దగ్గరకు వచ్చి ఏడ్చాడు. కానీ ఆ మహాత్ముని ముఖం యింతకుముందు లాగే వుండటం చూసి అతనికి ఆశ్చర్యం కలిగింది. "ప్రభూ! మీకు ఎంత అవమానం జరుగుతున్నా యింతకుముందు లాగానే ఆనందంగా వుండడానికి కారణమేమిటి?" అని అడిగాడు. ఆయన ఇలా సమాధానం చెప్పారు; "ఈ శరీరము మాంసము, ఎముకలతో తయారుచేసిన బొమ్మ. దీనిని ఏనుగు మీద కూర్చోబెట్టినా, గాడిద మీద కూర్చోబెట్టినా తేడా లేదు."

ఈ విధంగా జ్ఞానులు ఎల్లప్పుడూ బ్రహ్మానందంలో మునిగి వుంటారు.

ఆ తరువాత అందరూ భోజనం చేసి మరల కూర్చున్నారు.

డాక్టర్ వీరజీభాయి ప్రశ్నించాడు: "మోక్షం యొక్క స్వరూపం ఏమిటి?" ఎటువంటిది? అందుకు సాధనమేమిటి ?"

స్వా॥ని॥ మీరు దేనిని మోక్షమని చెబుతున్నారు?

డా॥వీ॥ దుఃఖము లేకపోవడం (దుఃఖ నివృత్తి), సుఖము పొందడం (సుఖప్రాప్తి) మోక్ష స్వరూపమని భావిస్తున్నాను.

స్వా॥ని॥ 'జ్ఞానా దేవ తు కైవల్యమ్' అని శృతి వాక్యము. అంటే మోక్షానికి సాక్షాత్కారణము (నిజమైన కారణము - ప్రత్యక్ష కారణము) జ్ఞానము. కానీ ప్రాణులన్నింటికీ అంతఃకరణములో ఉండే మూడు దోషాలు - మల, విక్షేప, ఆవరణ దోషాలు - ప్రాణుల దుఃఖాలన్నిటికీ కారణాలు. ఈ మూడు దోషాలను పోగొట్టుకోవడం వలన ముముక్షువులు మోక్ష సుఖాన్ని అనుభవిస్తారు. ప్రాణుల యందు అనుగ్రహం వలన సర్వజ్ఞుడు సర్వ శక్తిమంతుడైన పరమేశ్వరుడు కర్మ, ఉపాసన, జ్ఞానాలతో కూడిన త్రికాండ రూపమైన (మూడు కాండలతో కూడిన) వేదాన్ని రచించాడు. తద్వారా మూడు దోషాలను పోగొట్టడానికి కర్మ, ఉపాసన, జ్ఞానము అనే మూడు ఉపాయాలను క్రమంగా వేదంలో చెప్పాడు. దోషాలు మూడు అయినందువల్ల వలన పరమాత్మ మూడు కాండాలు రచించాడు. అంతకంటే ఎక్కువ కాండాలతో వేదాన్ని రచించవలసిన అవసరం లేకపోయింది. జననమరణాల దుఃఖాలను కలిగించు మల, విక్షేప, ఆవరణాలు నశించడానికి కర్మ, ఉపాసన, జ్ఞానము — ఈ మూడు అవసరమయ్యాయి. నిష్కామ కర్మచేత మానవుడు మలదోషాన్ని నశింప చేసుకోవాలి.

నిష్కామ కర్మ చేత చిత్తశుద్ధి

ఇహలోకంతోను, స్వర్గము మొదలైన పరలోకాలతోనూ సంబంధం కలిగిన విషయ సుఖానికి సంబంధించిన కోరికలను విడిచి దేవుడు ప్రసన్నుడు కావడానికి వర్ణాశ్రమ

ధర్మాన్ని అనుసరించి శాస్త్రాలు చేత ప్రతిపాదింపబడిన కర్మలను చేయడం నిష్కామ కర్మయోగము. ఈ నిష్కామ కర్మ యోగం చేత అంతఃకరణంలోని మలదోషాల నుంచి నివృత్తి పొంది వైరాగ్యము మొదలైన సాధనాలు లభిస్తాయి.

శ్లో॥ **స్వవర్ణాశ్రమధర్మేణ**
తపసా హరితోషణమ్ I
సాధనం ప్రభవేత్పుంసాం
వైరాగ్యాది చతుష్టయమ్ II

(అపరోక్షానుభూతి)

భావం : తమతమ వర్ణాశ్రమాలను అనుసరించి చేసే ధర్మానుష్ఠాన రూపమైన తపస్సు చేత పరమాత్మ సంతోషిస్తాడు. పరమాత్మ ప్రసన్నుడవడం వలన వివేకము, వైరాగ్యము మొదలైన సంపత్తి, వైరాగ్యము మొదలైన సాధనాలు కూడా ముముక్షువులకు లభిస్తాయి.

ఈ వైరాగ్యము నిష్కామ కర్మ లేకపోతే ప్రాప్తించదు. కర్మచేత సంసారంలో ప్రాణి బద్ధుడవుతాడు. సంసారం నుండి విముక్తిని పొందడానికి నిష్కామ కర్మే మొదటి సాధనము. సకామకర్మ బంధనానికి కారణము. జ్ఞానంతో కూడి భగవంతునికి అర్పించే బుద్ధితో చేయబడిన నిష్కామ కర్మ సంసారం నుండి ముక్తిని పొందడానికి కారణము. భగవానుడు భగవద్గీత రెండవ అధ్యాయములో యిలా చెప్పి వున్నాడు.

శ్లో॥ **కర్మజం బుద్ధియుక్తా హి**
ఫలం త్యక్త్వా మనీషిణః I
జన్మబన్ధ వినిర్ముక్తాః
పదం గచ్ఛన్త్యనామయమ్ II

భావం: సిద్ధిలోను అసిద్ధిలోనూ జయాపజయాలలోను పొంగుకృంగులను వదిలి సత్వబుద్ధితో కేవలం భగవంతునికి అర్పించే బుద్ధితో కర్మ ఫలాన్ని త్యజించి కర్మ చేయడం వలన విద్వాంసులు అవిద్య వలన కలిగిన బంధనాలు నుండి నివృత్తి పొంది ఉపద్రవం లేనటువంటి మోక్షం అనే పరమపదాన్ని పొందుతారు.

కొంతమంది యిలా అనుకుంటారు - కర్మ బంధనానికి కారణము కాబట్టి కామ్య కర్మములను త్యజించినట్లే (కోరికలతో కూడిన కర్మలను విడిచినట్లే), నిత్య నైమిత్తిక కర్మలను కూడా త్యజించాలి. కేవలము శ్రవణ మనన నిధిధ్యాసల చేతనే ఆత్మజ్ఞానం కలుగుతుంది. కర్మ ఆచరించాల్సిన అవసరం లేదు.

కానీ ఈ అభిప్రాయము నిజం కాదు. మలినమైన మనసు కలవాడికి ఎంత ఉపదేశించినా (బోధించినా) తత్వ జ్ఞానము కలుగదు. పైగా విరోచనునికి కలిగినట్లు విపరీత జ్ఞానం కలుగుతుంది. మలినమైన అద్దంలో ముఖము యొక్క ప్రతిబింబము కనిపించదు. అలాగే మలినమైన చిత్తములో జ్ఞానం అనే కాంతి ప్రతిబింబించదు. అజుడు మొదలైన ధర్మాచార పరాయణులైన రాజులకు వశిష్ఠుడు మొదలైనవారు బోధించినా, విషయవాసన అనే మాలిన్యము వుండటం వలన జ్ఞానం కలుగలేదు.

ప్రజాపతి దేహము మొదలైన వాటికంటే భిన్నమైన ఆత్మను గురించి బోధించినా, విరోచనునికి చిత్తములోని దోషము వలన 'శరీరమే ఆత్మ' అనే జ్ఞానము కలిగింది. తన అసురులైన సోదరులకు కూడా అతడు 'దేహమే ఆత్మ' అని బోధించాడు.

ఇలాగే నిష్కామకర్మ చేత అంతఃకరణలో పారిశుద్ధ్యాన్ని పొందకుండానే శ్రవణాదుల ద్వారా (శ్రవణము మొదలైన వాటి ద్వారా) జ్ఞానం కలుగుతుందని చెప్పేవాడు దేహాత్మ వాదాన్ని (అంటే ఈ శరీరమే ఆత్మ అనే వాదాన్ని) ప్రచారం చేస్తున్నాడని అర్థము.

ముముక్షువుకు శుభకరమైన బోధ కాదు అది. నిజానికి అతనిని నరకానికి పంపుతున్నాడు. ఎలాగంటే అజ్ఞానం వలన సగం నశించిన మానవుడికి 'నేనే బ్రహ్మము' అని చెబుతున్నాడు. అది అతనిని నరక ద్వారములో నిలబెట్టడం కాక మరేమిటి? ఇది వ్యాసుల వారి అభిప్రాయము. ఈ కారణం గానే జనకుడు మొదలైన మముక్షువులు కూడా నిష్కామకర్మ యోగాన్ని అనుష్ఠించారు. భగవంతుడైన శ్రీకృష్ణుడు భగవద్గీత మూడవ అధ్యాయంలో యిలా అన్నాడు:

శ్లో॥ **కర్మణైవ హి సంసిద్ధి**
మాస్థితా జనకాదయః I
లోక సంగ్రహమేవాపి
సంపశ్యన్కర్తు మర్హ II

భావము : పూర్వకాలములో జనకుడు మొదలైన వారు కూడా యిలాగే నిష్కామ కర్మ ద్వారా ఉత్తమమైన సిద్ధిని పొందారు. అలాగే లోకసంగ్రహం కోసం (లోక రక్షణార్థం) నిష్కామకర్మను అలవర్చుకోవాలి.

- సశేషం

(గత సంచిక తరువాయి)

శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

ఒక రోజు ఆనందమయి మాత సన్నిధిలో సంకీర్తన కార్యక్రమం జరుగుతున్నది. అమ్మ ఆ సంకీర్తన జరుగుతున్న ప్రదేశంలోనే ఒక అలౌకిక స్థితిలో అటూ ఇటూ సంచరిస్తున్నారు. ఉన్నట్లుండి అమ్మ యోగేశ్ రాయ్ భుజాల మీదకు ఎక్కి కూర్చున్నారు. కొన్ని నిమిషాలు కూర్చుని తరువాత క్రిందకు దిగారు. సంకీర్తన అనంతరం "అమ్మ మీ భుజాలపై కూర్చున్నపుడు మీకు ఎలా ఉంది? ఏమని అనిపించింది? మీకు బరువు అనిపించలేదా?" అని కొందరు భక్తులు యోగేశ్ రాయ్ ని అడిగారు. "నాకు ఆ సమయంలో ఎంతో ఆనందానుభూతి కలిగింది. ఒక పసిపిల్ల కూర్చుంటే ఎలా ఉంటుందో, సరిగా అలాగే అనిపించింది తప్ప ఏమాత్రం బరువు అనిపించలేదు. అలా అమ్మను నా భుజాల మీద మోయటం ఆమె నాకు ప్రసాదించిన గొప్ప ఆశీర్వచనంగా భావిస్తున్నాను" అన్నాడు యోగేశ్ రాయ్ ఎంతో సంతోషంతో.

పై సంఘటన జరిగిన కొన్నాళ్లకు యోగేశ్ రాయ్ ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లాడని కొందరి ద్వారా తెలిసింది. ఆ విషయం విన్న అమ్మ "యోగేశ్ వెళ్లిపోయాడా? మళ్లీ వస్తాడులే!" అన్నారు. అమ్మ చెప్పిన విధంగానే సరిగ్గా సంవత్సరం తర్వాత తిరిగి అమ్మ వద్దకు వచ్చాడు. అప్పుడు అమ్మ భోలానాథ్ గారి ద్వారా తన ఆదేశాన్ని ఈ విధంగా తెలియజేశారు: ఏ విధమైన ఏర్పాట్లు చేసుకోకుండా ఉన్నవాడు ఉన్నట్లుగా బయలుదేరి అన్ని క్షేత్రాలు తిరిగి రావాలి. వెళ్లే ముందు ఒకసారి తల్లిని చూసి బయలుదేరాలి. గడ్డము, మీసము, తల క్షౌరము చేయించుకొని వెళ్లాలి. మరల సంవత్సరం వరకు క్షౌరము చేయించుకొనకూడదు. సంవత్సరము తరువాత తిరిగి వచ్చి తనను అమ్మను దర్శించాలి. సమయం నిర్ణయించుకొని త్వరలో బయలుదేరాలి. అంతేకాదు, ప్రతినెల తనకు ఇక్కడ జీతం సమకూరేలా ఏర్పాటు చేసుకొని వెళ్లాలి. అమ్మ అజ్ఞానుసారం యోగేశ్ బాబు క్షేత్ర దర్శనానికి వెళ్ళాడు. అమ్మ నిర్దేశించినట్లు అన్ని ప్రదేశాలు తిరిగి సంవత్సరం తర్వాత తిరిగి వచ్చాడు. అమ్మ దర్శనానికి వచ్చినప్పుడు అక్కడ ఉన్న భక్తులెవ్వరు అతనిని గుర్తించలేకపోయారు బాగా పెరిగిన జుట్టు పొడవైన గడ్డంతో ఉన్నందువలన అతనిని కొత్త వ్యక్తిగా తలచారు. అమ్మ అతనిని ఆ వేషంతో ఫోటో తీయించుకొని తర్వాత క్షౌరము చేయించుకోమని చెప్పారు. ఆ తర్వాత ఉద్యోగంలో చేరమన్నారు. అంతేకాదు, అమ్మ అతనితో ఒక సంవత్సరం వరకు తనను దర్శించవద్దని ఆదేశించారు. అమ్మ అదేశాన్ని తు.చ. తప్పక పాటించాడు యోగేశ్. కొన్ని సంవత్సరాల తర్వాత అతడు ఉద్యోగం వదిలి రమణాశ్రమం వెళ్ళాడు. అక్కడ అతడు అన్నపూర్ణాలయ పూజారిగా, ఆశ్రమ బ్రహ్మచారిగా ఉండిపోయాడు.

ఒకసారి గురుప్రియా దేవి శ్రీ ఆనందమయి అమ్మకు పాయసం నివేదించాలనుకొని పాయసం వండి అమ్మ వద్దకు వచ్చింది. "అమ్మా!

పాయసం తెచ్చాను. దయతో స్వీకరించండి" అన్నది గురుప్రియ అమ్మ ముందు పాయస పాత్ర పెడుతూ. "అలాగే తింటాను గానీ, మరి నువ్వు నీ చేతులతోనే తినిపించాలి" అన్నారు అమ్మ. గురుప్రియ ఆనందానికి అవధులు లేవు. వెంటనే పాయసాన్ని ఒక గ్లాసులో పోసి అమ్మ నోటికి అందిస్తుంటే అమ్మ నెమ్మది నెమ్మదిగా త్రాగసాగారు. వున్నట్లుండి అమ్మ త్రాగటం ఆపి ఆమెతో "ఒక్కసారి యీ పాయసాన్ని నువ్వు త్రాగి చూడు" అన్నారు. ఆమె కంగారుగా "ఏమైందమ్మా" అంటుంటే, "ముందు నువ్వు త్రాగి చూడు తెలుస్తుంది" అన్నారు. ఆ పాయసాన్ని కొంచెం నోట్లో పోసుకున్న గురుప్రియ, అది ఎంతో వేడిగా వుండటం గమనించి నిర్ఘాంత పోయింది. 'తాగలేనంత వేడిగా వున్న ఆ పాయసాన్ని అమ్మకు తాగించాను. అయ్యో! అమ్మ ఎంత బాధపడ్డారో, ఎంతటి అపచారం జరిగింది' అనుకుంటూ తీవ్రమైన పరితాపంతో ఏడ్వసాగింది గురుప్రియ. జరిగిన పాపాన్ని క్షమించమని అమ్మ పాదాలపై పడింది. అమ్మ ఆమెను లేవనెత్తి "ఏమీ కాలేదులే, బాధపడకు" అంటూ ఆమెను ఓదార్చారు. అలాగే మరొకసారి మధ్యాహ్న భోజన సమయంలో అమ్మ గురుప్రియా దేవి వద్దకు వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డారు. నవ్వుతూ ఆశ్చర్యంగా చూస్తున్న గురుప్రియతో "నాకు చీర కట్టుతావా?" అన్నారు అమ్మ. 'అమ్మ తనకు చీర కట్టమంటున్నారు. నాకేమో అందరి స్త్రీల లాగా చక్కగా, అందంగా కట్టటం చేతకాదు. ఇప్పుడేమి చేయాలి?' అనుకొంటూ 'ఏది ఏమైనా అమ్మ అడిగినప్పుడు కాదని ఎలా చెప్పాలి అనుకొని "సరేనమ్మా! అలాగే కడతాను" అంటూ గురుప్రియ అమ్మకు చీరె కట్టింది.

ఎంతో శ్రమపడి కట్టినా, చీరె తిరగవైపు కట్టినట్లు తెలుసుకొన్న గురుప్రియ కంగారు పడుతుంటే అది చూచి అమ్మ నవ్వసాగారు. గురుప్రియ "అమ్మా! పొరపాటు జరిగిపోయింది. మళ్ళీ చక్కగా కడతానమ్మా" అంటూ ఎంతగానో బ్రతిమాలుతూ ప్రాధేయ పడినప్పటికీ అమ్మ ఒప్పుకొనక "నాకు యిలాగే బాగుంది. ఇలాగే తిరగవైపే వుంచుకుంటాను" అన్నారు అమ్మ. అక్కడే వున్న గురుప్రియ తండ్రి శశాంకబాబు "అమ్మా! ఏమిటమ్మా యిది? దానికి సరిగా తినిపించటం రాదు. సరిగా చీరె కట్టటం కూడా రాదు. తనకు ఏమీ తెలియదు. అయినా మీరు అన్ని పనులూ దాని చేతనే చేయించుకుంటారెందుకమ్మా?" అంటూ బాధ పడుతుంటే, అమ్మ చాలా చిన్నగా తనలో తాను అనుకొంటున్నట్లుగా "అవును! తమ సంగతి తమకే తెలియని వాళ్ళ చేతనే నేను అన్నీ చేయించుకొంటాను" అన్నారు. అమ్మ ఈ మాటలు ఎంత నెమ్మదిగా పలికారంటే, ఆ సమయంలో గురుప్రియ అమ్మకు అతి సమీపంలో వుండటంవల్ల ఆ మాటలు ఆమెకు తప్ప ఎవ్వరికీ విన్పించ లేదు.

అయితే "అమ్మ తమ సంగతి తమకే తెలియని వాళ్ళతోనే నేను అన్ని సేవలు చేయించుకుంటాను" అన్నారు ఆ సందర్భంలో. 'తమ సంగతి తమకే తెలియని వాళ్ళు అంటే' దాని అర్థం ఏమిటి? వాళ్ళు ఎవరు? ఎలాంటి వాళ్ళు? ఆలోచిస్తే దైవ సంబంధమైన విషయాలపై ఎక్కువ ప్రీతి, అనురక్తి కలిగివుండి ఎక్కువమంది ఎలా ప్రవర్తిస్తారో అలా కాక, సాధారణ లౌకిక విషయాలపైన తమ వ్యక్తిగత విషయాలపైన కూడా నిర్లిప్తంగా వ్యవహరించే వాళ్ళు అని అమ్మ భావం అయివుండవచ్చు ననిపిస్తుంది.

సాధారణంగా ఆనందమయి అమ్మ ప్రశాంతమైన రాత్రి సమయాలలో భక్తులతో తీరికగా సంభాషిస్తుండటం జరిగేది. ఎందరో భక్తులు దైవ సంబంధమైన ఎన్నో విషయాలలో తమ సందేహాలు, సమస్యల గురించి చర్చలు జరుపుతుండేవారు. అమ్మ వాటి నన్నింటినీ తన సహజమైన సరళమైన రీతిలో భక్తులకు వివరించి సమాధాన పరచేవారు. ఇలా ఎన్నోసార్లు తెల్లవార్లూ భక్తులు అమ్మతో ఆధ్యాత్మిక చర్చలు జరిపేవారు. మరొక విచిత్ర మేమంటే కొందరు భక్తులు ఎన్నో సందేహాలతో అమ్మ వద్దకు వచ్చేవారు కానీ, వారు అమ్మను ఏమీ అడుగక ముందే ఆ సందేహాలన్నీ సమాధానపడేవి. అసలు చాలామందికి అమ్మ వద్దకు రాగానే తమ సందేహాలే కాదు, తమ సమస్యలన్నింటినీ కూడా పూర్తిగా మరచిపోవడం జరిగేది. మౌనంగా అమ్మ సన్నిధి యొక్క ఆనందాన్ని అనుభవిస్తూ వుండిపోయేవారు. శ్రీ ఆనందమయి అమ్మ ఎన్నో విషయాల గురించి భక్తులకు చెపుతుంటే, అందరూ మంత్రముగ్ధుల వలె వింటూ వుండిపోయేవారు.

- సశేషం

దివ్య సన్నిధానములో బ్రహ్మానుభూతి పర్వదిన వేడుకలు !!

శ్రీమతి టి. పద్మావతి

పూజ్య భరద్వాజ గురుదేవులు ఫిబ్రవరి 9, 1963 తేదీన తమ ప్రథమ దర్శనంలోనే శ్రీ సాయినాథుని సమాధి మందిరంలో బ్రహ్మానుభూతిని పొందారు. అటు తరువాత వారు తమ జీవితాన్ని సంపూర్ణంగా శ్రీ సాయిబాబా సేవకై అంకితం చేసి, నాలుగు చెరగులా వారి గురించి ప్రచారం చేసి, ఎందరికో మార్గదర్శనం చేసి, సన్మార్గవర్తనులుగా చేసిన విషయం మనందరికీ విదితమే!

మహత్తరమైన ఆ పుణ్య దినాన్ని పురస్కరించుకొని గుమ్మళంపాడులోని శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానములో ఫిబ్రవరి 6 (తిథి ప్రకారం), ఫిబ్రవరి 9 (తేదీ ప్రకారం) బ్రహ్మానుభూతి పర్వదినాన్ని గురు పుత్రిక శ్రీమతి వేదవతి, గురు పుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గార్ల నేతృత్వంలో భక్తులందరూ ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

ఫిబ్రవరి 6 తిథి ప్రకారం జరిగిన ఉత్సవం:

ఆ రోజు ఉదయమే ''శ్రీకరునకు శుభకరునకు సుప్రభాతం" అంటూ భరద్వాజ గురుదేవులకు మేలుకొలుపు సేవతో కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆనాడే శ్రీగురుడు అంతర్ధానమైన రోజు కూడా కావడం మరొక విశేషం! కాకడ హారతి, మంగళస్నానాల అనంతరం పూజ్యశ్రీ బాబా, అమ్మగారు, మాస్టరుగార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అల్పాహారాన్ని సమర్పించాక, శ్రీ భరద్వాజ గురుదేవుల ప్రియ పుత్రిక శ్రీమతి వేదవతిగారు పూజాదికాలు నిర్వహించారు.

అనంతరం అంతటి శుభసందర్భాన్ని పురస్కరించుకుని వేదమ్మగారు సత్సంగం చేశారు. అందులో శిష్యులమనుకునే వారికి, సాధకులమనుకునే వారికి, భక్తులమనుకునేవారికి, అతి ముఖ్యమైన విషయాలు కొన్ని తెలియచేసారు. "పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడీలో బ్రహ్మానుభూతి పొందిన తరువాత కూడా శ్రీ గురుచరిత్ర పారాయణ చేసి, సాయినాథుడు 'నేనే నీ గురువు' నని చెప్పేదాకా ఒక నిర్ణయానికి రాలేదు. ఆ విధంగా చెప్పాక, వారికి సర్వస్య శరణాగతి చేసి, యిక వెనుదిరిగి చూడలేదు. కానీ ఈరోజుల్లో శిష్యులమని వారికి వారే భ్రమ పడేవారినీ, మేమే మీ గురువులమని భ్రమ పెట్టేవారినీ చూస్తుంటే,,,పూజ్యశ్రీ మాస్టరు గారికి, వీరికి ఎంత వ్యత్యాసమో అనిపిస్తుంది.

ముఖ్యంగా చాలా మందిలో వుండే ఒక రుగ్మత గురించి వివరిస్తూ, "బాబా ఏదైనా ఒక మంచి అనుభవాన్ని ప్రసాదిస్తే, అది జరిగిన కొత్తల్లో బాబాగారి గొప్పతనం గురించి చెప్తారు. విన్నవారిలో కొంతమంది, మీరెంత గొప్పవారైతే బాబా మీకు అంతటి అనుభవం ప్రసాదించారో అనడం మొదలు పెడతారు. అది నిజమేనేమో అనిపించి, క్రమేపీ ఆ లీల చెప్పడంలో వీరు తమ గొప్పదనం ఎక్కువగా చెప్పుకోవడం జరుగుతుంది. అంటే ఎంతటి మంచి సన్నివేశాన్నైనా మన అహంకారాన్ని పెంచుకోవడానికే వినియోగించుకుంటాము కానీ, ఆత్మవిమర్శ చేసుకుందామని అనిపించదు. కనుక మనం వేసే ప్రతీ అడుగు ఆత్మవికాసం వైపే వేస్తూ మనం భక్తులమని కానీ, శిష్యులమనికానీ

భ్రమపడకుండా వారికి నచ్చినట్లు ప్రవర్తించాలని ప్రయత్నిస్తున్న వాళ్లమని గుర్తుపెట్టుకోవాలని చెప్పి సత్సంగాన్ని ముగించారు.

అనంతరం పూజ్యశ్రీ మాస్టరుగారు మనందరి కోసం ఏరికోరి కూర్చిన భజన చేసి, నివేదన సమర్పించి, మంగళహారతితో ఆనాటి ఉత్సవానికి ముగింపు పలికారు.

ఫిబ్రవరి 9 తేదీ ప్రకారం జరిగిన ఉత్సవం:

ఫిబ్రవరి 8వ తేదీ సాయంత్రం నించి మాతృశ్రీ అలివేలుమంగమ్మ తల్లి దివ్యసన్నిధానంలో బ్రహ్మానుభూతి మహోత్సవం ఉత్సాహంగా మొదలయ్యింది. ఒక పక్క అలంకరణ కోసం తెచ్చిన పువ్వులతో కొంతమంది మాలలు కడుతూంటే, మరికొంతమంది మాతృదేవి సన్నిధి ప్రాంగణం అంతా శోభాయమానంగా ముగ్గులు వేశారు. ఫిబ్రవరి 9 తెల్లవారేసరికల్లా అందమైన అలంకరణతో పూజ్యశ్రీ మాస్టరుగారు చిత్రపటం రూపంలో కొలువైవున్నారు. ఒకవైపు వారి గురువుగారు సాయినాథులవారు, మరొకవైపు వారి దేవేరి అలివేలుమంగమ్మగారు కూడా చిత్రపటం రూపంలో ఆసీనులైవున్నారు. బాహ్యాలంకరణలతో కన్నులపండువుగా వుండటమే కాక ఆ ప్రదేశమంతా ఎంతో ప్రశాంతతని సంతరించుకుంది. అంతటి ఆహ్లాదకరమైన వాతావరణంలో, ఉదయమే గురుదంపతుల మేలుకొలుపు, బాబాకి కాకడ హారతి, మంగళ స్నానాలు, అల్పాహారం పూర్తయ్యాయి.

అనంతరం గురుదేవుల ప్రియ పుత్రులు శ్రీ ద్వారకనాథ్ గారు సత్సంగం చేశారు. దానిలో భాగంగా,,,,బ్రహ్మానుభూతి పర్వదినం రోజు పూజ్యశ్రీ మాస్టరుగారు పొందిన అనుభవాన్ని వివరిస్తూ...

'ఆ స్థితిని మానవుడన్న ప్రతీవాడూ పొందాలని, కానీ ఇప్పుడున్న పరిస్థితి దానికి వ్యతిరేకంగా వుందని చెప్పారు. లౌకికమైన విషయాల కోసం ఒకదాని తరవాత మరొకదానికోసం ప్రతివారూ పరుగెడుతూనే వున్నారు. మన మనస్సుని ఇంద్రియాలని అదుపులో వుంచుకోవడం చాలా ముఖ్యం. ఒక వస్తువుని చూసినప్పుడు వచ్చే భావాలని గుర్తుపట్టి సరిచేసుకోవాలి. అదే ఆధ్యాత్మికత. మనకి ఎన్నో జన్మల అరుదైన పుణ్యం సత్సంగం. దాని ప్రయోజనాన్ని పోగొట్టుకోకుండా మనకి లభించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఈ సత్సంగం అనేది సమాజం మొత్తం మారడానికి నా దగ్గరున్న అస్త్రం అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారని తెలిపారు. సత్సంగం అనేది ఒక వ్యక్తికో, లేదా ఒక బృందానికో సంబంధించినది కాదు. అందరిలో భగవంతుడిని చూడటానికి చేసే ప్రయత్నం సత్సంగం అని తెలియాలి.'

'ఇంకొక ముఖ్య విషయం గుర్తుపెట్టుకోవాలి. పూజ్యశ్రీ మాస్టరుగారిలా మనమూ చాలాసార్లు శిరిడి వెళ్ళాము. కానీ వారికి కలిగిన అనుభూతి లాంటిది మనకు కలగకపోవడానికి కారణం ఏమిటని ఆలోచిస్తే, శిరిడి సాయినాథులవారు ఎంత గొప్పవారైనా కావచ్చుగాక, కానీ అక్కడికి వెళ్లినవారి స్థాయిని బట్టి ఫలితం వుంటుందని అర్థమవుతుంది. మరి అటువంటి స్థాయిని మనమూ పొందడం ఎలా అంటే, దానిని వారు అన్ని గ్రంథాలలోనూ రాసేశారు. వాటిని మనం ఆచరిస్తే మనకీ అటువంటి అనుభూతి పొందడం వీలవుతుంది.'

ఇటువంటి శుభదినాన్ని పురస్కరించుకుని అందరం దానికోసం ప్రయత్నిద్దాం.,,,,,అంటూ వారి సత్సంగం పూర్తిచేశారు.

తదనంతరం గురుదేవులకు షోడశోపచార పూజచేసి, ఆనాటి ఉత్సవాన్ని ముగించారు. ●

గురుదంపతుల కల్యాణ మహోత్సవం

12వ పేజీ తరువాయి

మహోత్సవాన్ని తిలకించడానికి తరలి వచ్చారా అన్నట్లు ఆ ప్రాంతమంతా శుభప్రదమైన ప్రకంపనలతో ఆనందోత్సాహాలతో నిండిపోయింది. ఇదే విధమైన అనుభూతిని అన్ని ప్రాంతాల్లో కల్యాణ మహోత్సవం జరుపుకునే వారంతా పొందారని ఆనందాతిశయంతో విన్నవించారు.

ఇంతటి బృహత్కార్యం వారి కృపాశీస్సులతోనే జరుపుకోగలిగామని ప్రతి సత్సంగసభులు భావిస్తూ, మనందరికీ ఇంతటి అనుగ్రహవర్షాన్ని కురిపించడానికి గృహస్థాశ్రమం స్వీకరించిన పుణ్య దంపతులగు అలివేలుమంగా భరద్వాజులకు వినమ్రపూర్వక ప్రణామాలర్పించారు.

- సశేషం

మార్గం చూపిన మహనీయుడు

శ్రీమతి సరోజనమ్మ

(వీరికి మాస్టరుగారితో పరిచయభాగ్యం కలిగిన నాడే వారి దివ్యత్వాన్ని గుర్తించి వారి పాదాలు పట్టుకుని అనన్యంగా వారినే ఆశ్రయించి ఎన్నో దివ్య దర్శనాలను పొందిన తరువాత ఎన్నో అభిష్టాలు నెరవేరిన వైనాన్ని మరియు మాస్టరుగారి సమాధి చట్టాన్ని కళ్ళకు కట్టినట్టు అందిస్తున్నారు.)

మొదటిసారి మాస్టరుగారిని సుబ్బలక్షమ్మ గారింట్లో చూచాను.. సరోజనమ్మ గారు వచ్చి, సుబ్బలక్ష్మమ్మ గారింట్లో సత్సంగం జరుగుతుంది. భరద్వాజ మాస్టరు గారొస్తారు వెళ్దాం" అని అంటే సరేనని ఆమెతో కలిసి వెళ్ళాను. మేమెళ్ళిన తర్వాత చాలాసేపటికి ఆయన వచ్చారు. మొదటిసారి ఆయన్ను చూడగానే 'ఈయన మహాత్ముడు, మహానుభావుడు. ఈయన పాదాలు పట్టుకుంటే చాలు' అనే భావన కలిగింది నాకు. సత్సంగం అయ్యేవరకు వుండి, ఆ తర్వాత వచ్చేశాను. అప్పుడే సుబ్బలక్ష్మమ్మ గారు యిల్లు కట్టుకుంటూ వారికి ఇల్లు కావాలంటే మా యింట్లో ఒక పోర్షన్ ఆమెకు అద్దెకిచ్చాము. మొదటిరోజు మాస్టరు గారొచ్చి ముందు గదిలో పటాలు పెట్టి ఆ పూట ఆయనే ఆరతి ఇచ్చారు. ఆయన పార్టికోలో నిల్చుని నాకొక దివ్య దర్శనం యిచ్చారు. అందువల్ల నాకు ఎంతో తన్మయత్వం కల్గింది. ఆ తర్వాత అప్పుడప్పుడు వస్తుండేవారు. ఒకసారి "మాస్టారు గారండి, మా ఇంట్లోకొచ్చి మా దేవుని మందిరం చూడండి. ఫోటోలు ఎలా, ఎటు పెట్టుకోవాలో చెప్పండి" అని కోరాను. అప్పుడా మహానుభావుడు మా యింట్లోకొచ్చి "బాబా ఫోటో మాత్రం ఈశాన్యం మూల పెట్టు. మిగిలినవన్నీ నీ యిష్టం వచ్చినట్లు పెట్టుకోమ్మా. నీ పాత అర్చనని మాత్రం మార్చుకోవద్దమ్మా" అని చెప్పారు. ఆయన సుబ్బలక్ష్మమ్మ గారింటికి అప్పుడప్పుడు వస్తూండేవారు. ఏదన్నా చెప్తుండేవారు.

ఒకసారి మా మూడో అమ్మాయి జయశ్రీ ఇంటికి వచ్చింది. అప్పుడు మాస్టర్ గారు సుబ్బలక్ష్మమ్మ గారింటికి వచ్చి వున్నారు. నేను మా అమ్మాయిని మాస్టరుగారిని ఒకసారి చూసిరమ్మని బతిమాలుకున్నాను. వెంటనే మా అమ్మాయి వెళ్ళి, మాస్టర్ గారిని చూస్తూ భోరున ఏడ్వటం మొదలెట్టింది. "ఏంటమ్మా" అని అడిగారు మాస్టారుగారు. ఏం లేదండి అంటూ గజగజా వణికిపోతూ ఏడుస్తున్నది, ఏడుస్తూనే కాళ్ళకి దణ్ణం పెట్టుకుంది. ఈ లోపల నేను వచ్చాను. ఆమెకు మాస్టరుగారు దివ్యదర్శనం యిచ్చారు.

ఒకరోజు సుబ్బలక్ష్మమ్మ గార్తో "నన్ను మాస్టరుగారింటికి తీసుకెళ్ళమని" అడిగాను. ఆమె సరే పోదాం రమ్మని తీసుకెళ్ళారు. అప్పుడు మాస్టరుగారు సంతపేటలో వున్నారు. ఆయన నన్ను చూసి "ఏమ్మా, అంత దిగులుగా వున్నారు?" అని అడిగారు. నేను "నాయనా! నాకు ఐదుగురు కూతుళ్ళు. యిద్దరికి పెళ్ళిళ్ళయినాయి. ముగ్గురు అలా పెళ్ళిళ్ళు కాకుండా నిలబడిపోయారు. వాళ్ళ పెళ్ళిళ్ళు కాలేదనే దిగులు తప్ప నాకింకేం లేదు. వాళ్ళేమో పెళ్ళిళ్ళు చేసుకోమంటున్నారు. ఎంత చెప్పినా వినటం లేదు" అన్నాను. వెంటనే "చూడమ్మా కొద్ది రోజుల్లోనే వెంట వెంటనే యిద్దరికి

పెళ్ళిళ్ళు అవుతాయి. నువ్వేమీ దిగులు పెట్టుకోకమ్మా" అంటూ నా భుజం తట్టి నా ముఖాన విభూతి పెట్టారు. నాకు ఎంతో ఆనందం కల్గింది. ఆయన మాట మీద ఎంతో నమ్మకం కల్గింది. ఆయన చేత్తోనే 'బాబా చరిత్ర' తీసుకొని సుబ్బలక్ష్మమ్మగారితో పాటు యింటి కొచ్చేశాను. నాకు మాటిమాటికి కలలో కన్పిస్తుండేవారు. "ఇద్దరికీ పెళ్ళి ఔతుందమ్మా" అని గుచ్చి గుచ్చి చెప్పారు. నా అదృష్టం ఎట్లా వుందో, ఎట్లా వుందో! అప్పటికి వారికి ముప్పై ఏళ్ళు. పైబడ్డాయి. ఇది ఎలా జరుగుతుంది అని చాలా ఆశ్చర్యపోయాను. ఆయన చెప్పిన సం॥నికే ఒకమ్మాయికి పెళ్ళైంది. ఆ తర్వాత నాల్గు నెలలకే ఇంకొక అమ్మాయికి జరిగింది. ఇదంతా మాస్టర్ గారి ఆశీర్వాద ఫలితమే. మూడో అమ్మాయి వుద్యోగం చేస్తున్నది. ఒంగోల్లోనే చేస్తుంటే ఆ అమ్మాయిని కందుకూరు వేశారు. కందుకూరుకు, ఒంగోలుకు తిరగలేక ఆమె అవస్థ పడుతున్నది. ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే. ఆమె వెళ్ళి "మాస్టరుగారు నేను తిరగలేకపోతున్నాను" అంటే "నీకు ట్రాన్స్ఫర్ ఎక్కడికి కావాలమ్మా?" అని అడిగారు. 'ఒంగోలైతే బాగుంటుందండి. అమ్మా, నాన్నా పెద్ద వాళ్ళయినారు. వారి దగ్గరే వుండాలని నాకాపేక్షగా వుంది" అని అంటే, "అవుతుంది పొమ్మా, నేచెప్తాను బాబాకి, అవుతుంది పో!" అని అన్నారు. నెల తిరక్కుండానే ఆ అమ్మాయికి ఒంగోలు బదిలీ అయింది. ఇప్పటికి ఒంగోలు వచ్చి ఎనిమిదేళ్ళు. ఇవాల్టిదాకా ఒంగోల్లోనే ఆమె అభీష్టం ప్రకారం మాదగ్గరే వుంటున్నది. ఇవాల్టి దాకా మాస్టారుగారి దయ, బాబా దయ.

ఇంకొకసారి మాస్టరుగారి సత్సంగానికి వెళ్ళాను. సత్సంగం అయిపోయిన తర్వాత మాస్టారుగారి పాదాలకు నమస్కరించి "నాకేమైనా ఒక ఉపదేశం యివ్వండి" అని అడిగాను. అడిగితే "దీన్లో ఉపదేశాలు, మంత్రాలు అంటూ లేవమ్మా. బాబా విషయంలో సాయి, సాయి, సాయి, సాయి, అని చెప్పి సాయి నామం ఎల్లప్పుడూ చేసుకో. అదే జపమౌతుంది" అని అన్నారు. నన్నెప్పుడూ 'అమ్మా' అనేవారు. ఇంకోసారి "మీరంతలా బాబాను సేవిస్తున్నారు కదా! మీకెప్పుడైనా బాబా కన్పించారా?" అని అడిగితే "బాబా కన్పించలేదు గానీ, వెనక శక్తి వున్నట్లుగా అన్పిస్తుంది. నేను బాబాను నమ్ముకున్నాను. బాబా నాయందెప్పుడు వుండి నన్ను ఈ విధంగా నడిపిస్తున్నారమ్మా, బాబా నాకెప్పుడూ కన్పించలేదమ్మా " అని మాత్రం అన్నారు.

మా పెద్దమ్మాయిని మాస్టరుగారి దగ్గరకు తీసుకొచ్చాను. ఆమె చాలా బాధల్లో వుంది. "మేం ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నాం. చేతిలో మాత్రం డబ్బులేదు. ఏ విధంగా తీరుతుంది మాకోరిక" అని అడిగింది. "డబ్బు వస్తుందమ్మా. మీరిల్లు కట్టుకుంటారు" అని, "మీవారేం చేస్తూంటారు" అని అడిగితే, "క్రికెట్ క్లబ్" అని చెప్తే, "అయితే దాన్లోనే డబ్బు వస్తుందమ్మా. నువ్విల్లు కడ్తావు" అని అన్నారు మాస్టరుగారు. ఆ తర్వాత నెలకే ఏదో క్రికెట్ మ్యాచ్ పెట్టి మా అల్లుడికి డబ్బిచ్చారు. అది పెట్టి వాళ్ళు ఇల్లు కట్టుకున్నారు. అట్లా మాస్టరుగారిపై వారికెంతో ఎంతో నమ్మకం పెరిగింది.

మాస్టార్ గారి తోటి నేను మా ఆయన కూడా కలసి షిరిడీ యాత్ర చేసే అదృష్టం, అవకాశం కల్గింది. బస్సులో మొదట కర్నూల్ వెళ్ళి తాతను చూసుకొని, మంత్రాలయం వెళ్ళి ఆ స్వామిని దర్శించుకొని, గాణాపూర్ వెళ్ళాము. అక్కడ మాస్టరుగారు ఎంతో బాగా ఆధ్యాత్మికోపన్యాసం ఇచ్చారు. అక్కడ స్వామి భిక్షకెళ్ళటం, నిద్ర చేయటం లాంటివి చెప్పారు. మాస్టార్ గారితో పాటు భిక్షకెళ్ళాం. అక్కడ్నుంచి అక్కల్కోట వెళ్ళాము. ఆ స్థల మహాత్మ్యం గురించి చెప్పారు. అక్కడ్నుంచి శిరిడి వెళ్ళాం. అక్కడ రెండు రోజులున్నాం మాస్టార్ గారి తోటి. ఆయన దగ్గరుండి మాతో పాటు తిరుగుతూ వాటి ప్రాశస్త్యం గురించి చెప్పారు. ప్రథమంగా శిరిడీ లాంటి పవిత్ర క్షేత్రాన్ని మాస్టార్ గారితో పాటు చూడటమన్నది మావారికెంతో ఆనందం కల్గింది. ఆ అవకాశాన్ని వారు మా అదృష్టంగా భావించారు. ఆ తర్వాత "అలంది" వెళ్ళాం. అక్కడ జ్ఞానేశ్వర్ మహరాజ్ గురించి చెప్పారు ఆ చెట్టు దగ్గర కూర్చుని. జ్ఞానేశ్వర్ సమాధి మందిరం ప్రక్కన రెండు చెట్లున్నాయి. ఆ చెట్లలో ఒక చెట్టు వేరు స్వామిని తొలుస్తుండేదిట. ఆయన ఒక భక్తునకు కన్పించి ఇట్లా నన్ను ఇబ్బంది పెడ్తున్నది. దాన్ని తీసికెళ్ళి దూరంగా పెట్టండని చెప్పారాయన. అది చాలా పెద్దదైనా దాన్ని జాగ్రత్తగా ప్రక్కనే దూరంగా నాటితే అది బ్రతికింది. అదే చెట్టు కింద కూర్చుని మాస్టార్ గారు జ్ఞానేశ్వర్ మహరాజ్ గురించి సత్సంగం చెప్పి మాచేత భజన చేయించారు.

- సశేషం

(గత సంచిక తరువాయి)

మరికొందరు భక్తులు

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

శ్రీమతి కాశీబాయి కణీత్కర్

శ్రీమతి కాశీబాయి కణీత్కర్ యిలా చెప్పింది : ‘‘సం॥ 1905లో మేము యవలాలో వుండగా మా పరిచయస్తు లొకసారి శిరిడీలోని బాబా దర్శనానికి మమ్మల్ని గూడ రమ్మని ఆహ్వానించారు. కొద్దిరోజుల తర్వాత మా యింట్లో టేబిల్ మీద ఒక కార్డు సైజు బాబా ఫోటో కన్పించింది. అయితే అదెవరు తెచ్చి పెట్టారో మాకు తెలియనేలేదు. అయినా ఆ పటం పట్లగాని, మా మిత్రుల ఆహ్వానం పట్లకాని మేమంతగా ఆసక్తి చూపలేదు. జనవరి మాసాంతంలో మావారిని షోలాపూర్, అహ్మదునగర్, ధూలియా జిల్లాలకు తాత్కాలిక సబ్ జడ్జిగా వేసినపుడు ఆఫీసు పనిమీద అహ్మదునగర్, కర్జన్, కోపర్గావ్ వెళ్ళాము. అందులో భాగంగా మావారొకరోజు మమ్మల్ని రహటాకు బయల్దేరదీశారు. “మీరు రహటా వెళ్ళి పని చూచుకురండి, మేమీలోగా శిరిడీలో వుంటాము” అన్నాము. నేను బాల్యంలో శ్రీ అక్కల్కోట స్వామిని దర్శించాను గనుక బాబాను గూడ చూడాలని, వారు గూడ అక్కల్కోట స్వామిని పోలివుంటే నాకు వారిపట్ల దృఢ విశ్వాసము కల్గవచ్చనీ తలచి బయల్దేరాను.

మేము శిరిడీ చేరి ఆఫీసు కాగితాలు చావడిలోను, సామానులు గ్రామ ప్రవేశములో నున్న బాలల పాఠశాలలోనూ పెట్టి త్వరత్వరగా మశీదు చేరాము. మేము బాబాను దర్శించి తల ఒక అర్ధణా దక్షిణ సమర్పించాము. ఆ రోజులలో ఆయన అంతకు మించి దక్షిణ స్వీకరించేవారు గాదు. తర్వాత మేము చావడికి వచ్చి టీ తాగుతుండగా మా ప్రక్కగా బాబా లెండీ నుండి మశీదుకు వెళ్తున్నారు. మేము వెళ్ళి ఆయనకు పాదాభివందనం చేసుకున్నాము. మా చిన్న అమ్మాయి వారికి గూడ ఒక ‘టీ’ సమర్పించబోయింది. ఆయన దానికేసి పరీక్షగా చూచి, ‘ఏమిటిది’ అన్నారు. మేము ‘టీ’ అని చెప్పగానే ఆయన వద్దనట్లు తలవూపి సాగిపోయారు.

టీ త్రాగిన వెంటనే మా అబ్బాయి, శ్యామా, మా అల్లుడు గంగాధరపంత్ లు బాబా దర్శనానికి మశీదుకు వెళ్ళారు. అపుడాయన ఒక్కరే వున్నారు. ఆయన ఉపాహారం (‘న్యాహరి’) తీసుకుంటున్నారని గమనించి మా వాళ్ళు ద్వారం వద్ద ఆగి వారిని చూచారు. కాని వారికి కన్పించింది సాయి రూపంగాదు, అక్కల్కోట స్వామియే, స్పష్టంగా రక్తమాంసాలతో గూడిన ఆ రూపమే! కొద్ది నిమిషాలు అదే రూపాన్ని మావాళ్ళు నిశ్చేష్టులై చూస్తూ నిలబడిపోయారు. ఆ తర్వాత మశీదులోకి అడుగు పెట్టిన క్షణంలో, రెప్పపాటులో ఆ రూపమదృశ్యమై వారికి సాయి రూపమే కన్పించింది. కాని నా దురదృష్టం కొద్దీ నేను కోరిన ఆ దర్శనభాగ్యం నాకు కల్గలేదు.

అది సాయి చావడిలో నిద్రించే రోజు. ఆయనక్కడకు చేరి మహల్సాపతితో మాట్లాడుతున్నారు. అతడు వారి చిలిం నింపి వెలిగించడానికి సిద్ధం చేస్తుండగా అందులో వుండే గులకరాయి జారి క్రిందపడింది. అది నెపంగా పెట్టుకుని బాబా పట్టరాని కోపంతో అందరినీ తిట్టసాగారు. ఆ తిట్లు స్త్రీలెవరూ వినడానికి గూడ తగనివిగా వున్నాయి. పరిస్థితి గమనించి మా ఆడవాళ్ళను అక్కడినుండి తొలగి పొమ్మని అక్కడి భక్తులు సూచించగా మేము వచ్చేసాము.

మరురోజు సాయంత్రం మేమంతా స్కూలు వెనుక కూర్చుని వుండగా యీ విషయం ప్రస్తావన కొచ్చింది. మావారు, “బాబా గొప్ప మహాత్ములుగదా, అంత చెడ్డగా తిడతారేమి?” అన్నారు. మాతో వచ్చిన ఆఫీసు ఉద్యోగులు, “మహాత్ములు తిట్టినా, మధురంగా మాట్లాడినా ఒక్కటే, వాటిని పట్టించుకోనక్కరలేదు” అన్నారు. మావారు “నాకు మాత్రం అదేమీ అర్థంగావడంలేదు. మేమిక్కడ కొచ్చినప్పటినుండి

మేము సమర్పించిన దక్షిణంతా మేమడగకుండానే ఆయనే తిరిగిస్తే ఆయన మహాత్ముడని నమ్ముతాను" అన్నారు. ఆ మరురోజు మా జవానులు, గుమస్తాలూ ముందుగా ఆయనవద్ద సెలవు తీసుకుని కోపర్గావ్ వెళ్ళిపోయారు. వాళ్ళవెనుకే మావారుగూడ సెలవు తీసుకోడానికి వెళ్ళారు. బాబా తాము కూర్చొన్న గోనె క్రిందే ఆ డబ్బు సిద్ధంగా వుంచుకున్నారేమో, మావారు నమస్కరించగానే అదంతా తీసి ఆయన చేతిలో పోసి, "ఇదిగో, ఇంతవరకూ నీవు సమర్పించిన దక్షిణ!" అన్నారు.

అటు తర్వాత ఆడవాళ్ళం అయిదారు మందిమి వారివద్ద సెలవు కోరటానికి వెళ్ళాలనుకున్నాం. బాబాకు దక్షిణ యివ్వటానికై అందరికీ తలకొక 6 పైసలు ఇవ్వాలనుకున్నాను. గాని, నాదగ్గర చిల్లరలేక కొందరికి 6 పైసలు(అణా), ఒకరికి 12 పైసలు(బేడ), ఒకరికి 24 పైసల(పావలా) కాసులూ ఇచ్చాను. మా పాప అది చూచి, 'అదేమిటి? అందరికీ సమానంగా యివ్వక ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ యిస్తావు?' అన్నది. నేను, 'రోజూ అర్ధణా కాసులందరికీ ఇస్తుండటంతో నా వద్ద అవి అయిపోయినవి. నీకు నేనేమిచ్చానో అదే బాబాకు సమర్పించు' అన్నాను. ఇంతలో మావారు, 'మన దక్షిణ బాబా అంగీకరించలేదు. అదంతా వాపసు ఇచ్చేసారు' అన్నారు. నేను వెంటనే మశీదుకెళ్ళి బాబాతో, 'ధునికి కట్టెలు అవీ అవసరముంటాయిగదా, అవి కొనడానికి వినియోగించక దక్షిణ మావారికి తిరిగిచ్చేశారేమి?' అన్నాను. వెంటనే ఆయన, 'మీరంతా గత నాలుగురోజులుగా నాకు డబ్బులివ్వడంలా? ఇప్పుడు మీ దగ్గర ఏముంటే అదివ్వండి!' అన్నారు. సరిగ్గా మా పాపతో నేనన్నమాటలే అవి! నేను మా అమ్మాయితో చావడిలో అన్న మాటలుగాని, మేమెక్కడో స్కూలు వెనుక కూర్చున్నప్పుడు మావారన్న మాటలుగాని బాబాకెలా తెలిసాయో!"

ఈమె కుమార్తె బానుతాయి తన బాల్యస్మృతులిలా వ్రాసింది : "నేను మొదటిసారిగా నా ఏడవయేట సాయిబాబాను దర్శించాను. నా తండ్రి ఆర్.ఆర్. గోవింద వాసుదేవ్ కణీత్కర్. ఆయన యవలాలో న్యాయమూర్తిగా పనిచేస్తుండేవారు. ఒకసారి ఆయన ఆఫీసు పర్యటనలో మా కుటుంబమంతటిని కోపర్గావ్ కు తీసుకెళ్ళారు. గోదావరి నదికి అవతల ఒడ్డున గొప్ప ముస్లిం సాధువున్నారని, అంతదూరం వచ్చాం గనుక వారినిగూడ దర్శిస్తే బాగుంటుందనీ ఎవరో చెప్పారు. మా తల్లిదండ్రులకు సాధు సత్పురుషులపై భక్తి శ్రద్ధలుండేవి గనుక మేము వెంటనే శిరిడీ వెళ్ళి నాటి రాత్రికి అక్కడ బసచేసాము. మేము గ్రామ పాఠశాలలో దిగి బాబాను దర్శించడానికి మశీదుకు వెళ్ళాము. అప్పటికి బాబా గురించి ఎక్కువమందికి తెలియదు. అక్కడొక చిన్న మశీదు, దానికి చిన్న ముంగిలీ వున్నాయి. మశీదు నేలంతా ఎన్నో గోతులున్నాయి. అందులో ఎడమ ప్రక్కన ధుని వెలుగుతున్నది. కుడివైపున మహా గంభీరుడు, ఆజానుబాహువూ అయిన వ్యక్తి వున్నారు. ఆయన పాదాలవరకూ వుండే పొడుగాటి కఫ్నీ వేసుకున్నారు. ఆయన తలకు ఒక తెల్లని గుడ్డ చుట్టుకొని, ఒక చినిగిపోయిన గోనెపట్టా మీద కూర్చుని చిలిం పీలుస్తున్నారు. తమ దర్శనానికి వచ్చినవారిని ఆయన దక్షిణ అడిగేవారుట. నిరంతరం వెలుగుతున్న ధునికి కట్టెలకోసం కాబోలు. ఆ సంగతి విని మా అమ్మ మా అందరికీ కొద్ది చిల్లర యిచ్చి వారికి దక్షిణ సమర్పించమన్నారు. మేమది వారిచేతిలో పెట్టి వారి పాదాలకు నమస్కరించి మా బసకొచ్చాము. అపుడు కోర్టు గుమస్తాలు గూడ మాతోపాటు వచ్చారు. నాటిరాత్రి మేమందరం మాట్లాడుకొంటుండగా మా నాన్నగారు, 'ఈయనేమి సాధువు- అందరినీ దక్షిణడుగుతారు, అందరినీ తిడతారు!' అన్నారు. అపుడచ్చటి వారు తాము వినిన, చూచిన బాబాలీలలను గురించి చెప్పారు. మరురోజే మేము తిరిగి వెళ్ళబోతూ బాబాను దర్శించి, వారిముందు దక్షిణబెట్టి నమస్కారం చేసుకున్నాము. తర్వాత వారి దర్శనానికి మా అమ్మా, నాన్నా వెళ్ళినపుడు అంతవరకు మేమిచ్చిన దక్షిణంతా వారికిచ్చేసి, ఆ ముందటిరాత్రి మా నాన్నగారన్న మాటలే అన్నారు బాబా. మా అమ్మ చిన్నబుచ్చుకొని, 'మాదక్షిణ తిరిగి ఇచ్చేస్తున్నారేమి బాబా? దీనితో ధునికి కట్టెలు కొనండి! అన్నది. బాబా, 'అయిష్టంగా యిచ్చిన ఈ డబ్బు మీరే వుంచుకోండి' అన్నారు. విధిలేక వాళ్ళాడబ్బు తీసుకున్నారు. వారి స్పర్శతో యిచ్చిన డబ్బులు వారి ప్రసాదమని తలచి వాటిని మా అమ్మ ఒక పట్టుసంచిలో కట్టి పూజలో వుంచుకొన్నది. మేము ఎప్పుడేమి చేస్తున్నదీ, ఏమి మాట్లాడుతున్నదీ బాబాకు తెలుస్తుంటుందని గుర్తించారు మా నాన్న. తర్వాత మేము చాలాసార్లు వారిని దర్శించాము. ప్రతీసారీ ఆయన మాకేదో ఒక లీల చూపిస్తూనే వున్నారు. ఆయన తమను దర్శించిన వారికి స్వయంగా ఊదీ ప్రసాదించేవారు. ఒక్కొక్కపుడు వారే నొసట పెట్టేవారు గూడ.

ఒకసారి నాకూ, మా అన్నకూ అమ్మవారుపోసి, మా అన్న పరిస్థితి ఎంతో ఆందోళనగా వుంది. అతడి వంటిమీద పొక్కులు బాగా పెద్దవై, జ్వరం బాగా హెచ్చింది. ఆ పొక్కులు

పగిలాయి. అతని ముక్కు నుండి గూడ ఎంతో రక్తం కారసాగింది, ఇంట్లో అందరూ భయపడసాగారు. మా అమ్మ మాత్రం బాబాను హృదయపూర్వకంగా నమ్ముకొని నిత్యమూ మా యిద్దరికీ ఊదీ పెడుతుండేది. ఆ సమయంలో బాబా తమ భక్తులతో, 'బండి తీసుకురండి, నేను యవలా వెళ్ళాలి, ఆ తల్లి నన్ను పిలుస్తున్నది' అని పదేపదే అంటున్నారుట. తర్వాత నాకూ, మా అన్నకూ జబ్బు తగ్గిపోయింది.

ఆ తర్వాత ఒకనాటి ఉదయం మాయింటికొక ఫకీరు భిక్ష కొచ్చి, 'అలక్ నిరంజన్ ' అని కేకవేసారు. అపుడు నేను అక్కడే ఆడుకొంటున్నాను. అపుడు గేటువద్దనున్న మా బంట్రోతు, 'ఇప్పుడు యిచటి ధాన్యం డబ్బా ఖాళీగావున్నది, యింట్లోనివారు యీ రోజు యింకా ధాన్యం పోయలేదు. కొద్ది సేపాగిరా!' అని చెప్పాడు. ఆ ఫకీరు వెళ్ళి కొద్ది సేపయ్యాక మళ్ళీ వచ్చాడు. మా బంట్రోతు మళ్ళీ అలానే చెప్పాడు. ఆ ఫకీరు చిన్నగా నవ్వి, 'అందులో ఏముంటే అదేవేయి, నేను మళ్ళీ ఎపుడొచ్చేది?' అన్నాడు. ఆ డబ్బా ఖాళీగా వున్నదని చెబితే ఆ ఫకీరు, 'అందులో నాల్గు గింజలున్నాచాలు' అన్నాడు. అపుడు మాబంట్రోతు గంగారాం అందులోవున్న రెండు గింజలు తీసి అతనికిచ్చాడు. ఆ ఫకీరు ఖాళీగా వున్న జోలెపట్టి గింజలు వేసాక, ఒకసారి జోలె మూసి మరల తెరిచారు. ఈసారి దానినిండుగా గింజలున్నాయి. ఆ ఫకీరునవ్వి, 'నిండుగా భిక్షవున్నది, చూసావా' అని నవ్వుతూ వెళ్ళిపోయారు. తర్వాత మా అమ్మ ఆ లీలగురించి విని వెంటనే వెళ్ళి ఆ ఫకీరును తీసుకురమ్మని, ఆయన సాయిబాబాయేననీ చెప్పి మా బంట్రోతును పంపింది. మా బంట్రోతు పరుగున వెళ్ళి, కొంతసేపు వెదికి తిరిగివచ్చి ఆయనెక్కడా కనిపించలేదని చెప్పాడు. కొద్దికాలానికి మేము శిరిడీ వెళ్ళినపుడు మా అమ్మతో బాబా, 'ఆయీ, నేను మీయింటికి వచ్చివెళ్ళాను' అన్నారు. బాబాకు మామిడిపిండెల ఊరగాయ, మామిడిపండ్లు, ద్రాక్షపండ్లు, 'సీరా' (రవ్వకేసరి) ఇష్టమని విని, మేమెప్పుడు శిరిడీ వెళ్ళినా అవి తీసుకువెళ్ళి బాబాకు సమర్పించుకొనేవాళ్ళం.

ఒకసారి చాలామందిమి శిరిడీ వెళ్ళాము. దివ్యజ్ఞాన సమాజానికి సంబంధించిన మా బావగారు, రామభావూ తిలక్ గూడ మాతో వున్నారు. అతడు బాబా సిద్ధపురుషులైతే ఆయనకన్ని భాషలూ, అర్థమవ్వాలనుకొని, దివ్యజ్ఞాన సమాజంవారు క్రొత్తగా ప్రచురించిన 'Masters' అనే ఆంగ్ల గ్రంథం మశీదుకు తీసుకువచ్చాడు. అతడు సాష్టాంగ నమస్కారం చేసుకొని అక్కడ కూర్చున్నాక, బాబా చిలిం పీలుస్తూ కొద్దిసేపు అతడికేసి తదేకంగా చూచారు. ఇది వారి అలవాటు. ఆయన చిలిం త్రాగుతూ వచ్చినవారికేసి కొద్దిసేపు చూచి తాపీగా వారితో మాట్లాడేవారు. ఆయన తిలక్ ను, 'నీవేం తెచ్చావ్?' అనడిగారు. అతడా పుస్తకం చూపగానే బాబా దానిని తమ చేతిలోకి తీసుకొని పుటలు తిప్పిచూచి అతడికిస్తూ, ఫలానా పేజి తెరచి తమకు వినిపించమన్నారు. అతడా పేజీ తెరచి చదవసాగాడు. బాబా శ్రద్ధగా వింటున్నారు. అందులో సిద్ధపురుషుల గురించే వ్రాసియున్నది. ఆయనను రామభావు కొన్ని ప్రశ్నలువేసి, వారి సమాధానాలను బట్టి ఆయన సిద్ధపురుషుడేనని నిర్ణయించుకున్నాడు. ఆంగ్లంలో వ్రాయబడిన ఆ గ్రంథంలోని విషయాలన్నీ ఆయనకు బాగా తెలుసునని ఋజువైంది.

యవలాకు చెందిన ఒక మమల్తదారు బాబా సిద్ధపురుషులవునోకాదో చూడదలచి వారిని దర్శించి ఆయనకు కలకండ, కొబ్బరికాయ సమర్పించి నమస్కరించుకున్నాడు. అప్పుడే వేరొక భక్తుడు కర్పూరం వెలిగించి బాబాకు ఆరతిచ్చాడు. బాబా అందరికీ కలకండ పంచాక ఐదు, ఆరు కలకండ ముక్కలు వెలిగించి తమ అరచేతిలో పెట్టుకున్నారు. అవి గూడ కర్పూరంలాగే వెలిగాయి. తనకు సంశయ నివృత్తి చేయడానికే బాబా ఆ లీల చేసారని ఆ మమల్తదారు తలచాడు. కాని అది చూచాక గూడ, అతడికి యింటికి వెళ్ళాక ఒక సందేహమొచ్చింది. బాబా పంచిన కలకండలో కర్పూరం కలిసి వున్నదేమోనని తలచి అతడు బాబా తనకు ప్రసాదించిన కలకండ ముక్క వెల్గించాలని ప్రయత్నించాడు గాని, అది ఎంతకూ వెల్గలేదు. అది బాబా లీలేనని అతడు నిర్ణయించుకున్నాడు."

ఒకసారి బాబా తమ మహాసమాధి గురించి ముందుగా సూచించారు. అపుడు నిర్మాణంలోవున్న బూటీవాడాను చూపుతూ, 'లాయిల్లాహ యిల్లిల్లిహ; క్యాబడా దర్బార్ హై! మున్షీజీ తో అంథా హై; సర్దార్జీ ఛుటాయీ; అల్లాహ్ మాలిక్ హై! అల్లా అచ్ఛాకరేగా!' అన్నారు. ఆయన చెప్పినట్లే ఆ బూటీ వాడా వారి సమాధి మందిరమైంది. ముందుముందు వారి సమాధి మందిరం దర్శించనున్న ధనికులు ('సర్దాజీ'), ప్రభుత్వాధికారులు ('మున్షీజీ') లతో గూడిన లెక్కకుమీరిన భక్తజనులే ఆయన చెప్పిన దర్బారు.

- సశేషం

ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి న్యాయపతి రేవతి, భువనేశ్వర్

మాకు చిన్నప్పటి నించి సాయినాథునితో అనుబంధం వుంది. మా అమ్మగారు ఎక్కువగా సాయి చరిత్ర పారాయణ చేస్తుండేవారు. మాకు అప్పట్లో ఆర్థిక సమస్యలు ఎక్కువగా వుండేవి. అవి ఒక కొలిక్కి రావాలని 1992 ప్రాంతంలో అమ్మ సాయి చరిత్ర 9 సార్లు పారాయణ చేసింది. వెంటనే మా పెద్ద తమ్ముడికి ఉద్యోగం వచ్చింది. కొంతవరకు పరిస్థితి చక్కబడింది. తరవాత ఏ సమస్య వచ్చినా అమ్మ పారాయణ చెయ్యడం పరిస్థితులు చక్కబడటం జరిగేది.

కొన్నాళ్ళకి మా నాన్నగారు రిటైర్ అయ్యారు. తరవాత అమ్మకి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చింది. పరిస్థితులన్నీ చక్కబడ్డాక మళ్ళీ కొత్త సమస్య వచ్చిందని అందరం చాలా బాధపడ్డాము. ఒకరోజు నేను బాబా పటం ముందు కూర్చుని, అమ్మకి ఎందుకు యిలా జరిగిందని బాగా ఏడ్చాను. అదేరోజు బాబా నాకు స్వప్న దర్శనం యిచ్చారు. అందులో కొన్ని కప్పలు చూపించారు. అవన్నీ చనిపోయినట్లుగా నేలకి కరుచుకుని వున్నాయి. నాకేమీ అర్థం కాలేదు. మర్నాడు ఈ విషయం మా అమ్మకి చెప్పాను. అప్పుడు మా అమ్మ ఆశ్చర్యపోతూ,, "మా చిన్నప్పుడు స్నేహితులందరం కలసి ఆడుకుంటూ, అక్కడ కప్పలుంటే మేము వాటిని రాళ్లతో కొట్టి ఎవరు ఎక్కువ కప్పల్ని చంపితే వాళ్ళు గెలిచినట్లని పందెం పెట్టుకుని, అందరం రాళ్లతో కొట్టాము. అవి చనిపోయి, నేలకి కరుచుకుని వుండిపోయేవి. అవి నీకు సాయి చూపించారంటే, ఆ పాపం వల్ల నాకిప్పుడు క్యాన్సర్ వచ్చిందన్నమాట" అని చెప్పింది. నేను యిది విని చాలా ఆశ్చర్యపోయాను. తరవాత అమ్మకి మంచి వైద్యం చేయించాము. ఆరోగ్యం కుదుట పడ్డాక నాకు వివాహం అయ్యింది. మావారితో ఒరిస్సా వచ్చేసాను.

కొన్నాళ్ళకి పురిటికని విజయవాడ అమ్మా వాళ్ళ ఇంటికి వెళ్ళాను. అప్పుడు మా చిన్నతమ్ముడి కోసం మా అమ్మ బాబా చరిత్ర పారాయణ చేస్తున్నారు. ఒకరోజు అమ్మకి సాయిబాబా స్వప్నదర్శనమిచ్చి, ''నీకు మనవడు పుడతాడు 'నృసింహ సరస్వతి' అని పేరు పెట్టుకోండి" అని చెప్పారట. ఆ విషయం నేను వెళ్ళాక అమ్మ నాతో చెప్పింది. అప్పుడు నేను "నాకు, మావారికీ ఆడపిల్లంటే చాలా ఇష్టం. మాకు ఆడపిల్లే పుట్టాలని నేను దణ్ణం పెట్టుకుంటున్నాను. 'సాయి సంహిత' అని పేరు కూడా నిర్ణయించుకున్నాము. నువ్వు చిన్న తమ్ముడి కోసం పారాయణ చేస్తున్నావు కనుక వాడికి పెళ్లయ్యాక భవిష్యత్తులో అలా జరుగుతుందని చెప్పారేమో" అని కొట్టిపారేసాను. ఆ రోజు తెల్లవారుఝామున నాకొక స్వప్నం వచ్చింది... ముత్యాలంపాడు బాబా గుడి బైట, బాబాలాగా వున్న ఒకాయన కూర్చుని, పైకి ఆకాశంవైపు చూస్తూ గట్టిగా "'నేను వేరు, నృసింహ సరస్వతి వేరనుకున్నావా? నీకే కొడుకు పుడతాడు. నీ గురించే నేను చెప్పింది. వాడికి 'నృసింహసరస్వతి' అని పేరుపెట్టు. రెండు రూపాయలు దక్షిణ ఇవ్వు" అన్నారు. తరవాత వారు చెప్పినట్లే అబ్బాయి పుట్టాడు.

ఇక్కడ కూడా ఒక మహాత్మ్యం జరిగింది. ఏప్రిల్ 16 న నేను ఆసుపత్రిలో చేరాను. ఆ రోజు మావారు బైట నిల్చుని ఉంటే, ఒక చిన్న కాంతి మావారి ముందుకి వచ్చి, అందులో

బాబా కనిపించి, "రేపు సాయంత్రం ఆరు గంటల పన్నెండు నిముషాలకి అబ్బాయి పుడతాడు" అని చెప్పారట. మావారు బాబాని పూజించేవారు కాదు. నేను పూజిస్తుంటే వద్దనేవారు కాదు. కానీ బాబా తనకు అలా చెప్పారేమిటా అని ఒకింత ఆశ్చర్యపోయి, రేపు అలా జరిగితే చూద్దాం అనుకున్నారట. బాబా చెప్పినట్లే, మర్నాడు సాయంత్రం సరిగ్గా ఆరుగంటల పన్నెండు నిముషాలకి బాబు పుట్టాడు. ఆ రోజు గురువారం, ఏకాదశి. తరవాత మావారు బాబా తనకిచ్చిన అనుభవాన్ని మాకు చెప్పారు. బాబా చెప్పినట్లే మా అబ్బాయికి, వారిపేరు కూడా కలుపుకుని, 'సాయి నృసింహ సరస్వతి రఘు వినీత్' అని పేరు పెట్టాము. అందులో మా మావగారి పేరుకూడా కలిపాము.

తరవాత రెండేళ్ళకి మా అమ్మగారికి మళ్ళీ కాన్సర్ వ్యాధి తిరగపెట్టింది. అప్పుడు అమ్మని మావూరికి అంటే బరంపురం తీసుకువచ్చేసాము. కొన్నిరోజుల తరవాత బాబా నాకు కలలో కనపడి ఒకచేత్తో విభూతి చూపిస్తూ, ఇంకొకచేతివేళ్ళు ఐదూ ముడిచి తెరిచి చూపిస్తున్నారు. ఇంక అప్పటినించి, నేను అమ్మకి ఇచ్చే ప్రతిదాంట్లో విభూతి వేసి ఇచ్చేదాన్ని. సరిగ్గా 5 నెలలకి అమ్మని ఘోరమైన ఆ బాధలనించి విముక్తురాలిని చేశారు. చేతివేళ్ళు ముడిచి తెరచి ఎందుకు చేశారో అప్పుడు అర్థమయ్యింది. ఇలా ప్రతిక్షణం మమ్మల్ని కనిపెట్టుకొనివుంటూ, మాకు జరగబోయేవన్నీ ఎప్పటికప్పుడు తెలియచేస్తూనే వున్నారు.

మా అమ్మకి ఒక అలవాటు వుండేది. ఇంట్లో ఏ శుభకార్యమైనా బాబాకి నమస్కరించుకుని, మీరు తప్పకుండా వచ్చి ప్రసాదం తీసుకుని వెళ్లాలని చెప్పేది. అదే విధంగా బాబా కూడా గుర్తుతెలియని వ్యక్తుల రూపంలో వచ్చి భోజనం చేసి వెళ్లేవారు. అందువల్ల మా అమ్మ సంవత్సరీకాలకి నేనుకూడా బాబాని తప్పకుండావచ్చి ప్రసాదం తీసుకోవాలని ప్రార్థన చేసాను.

సంవత్సరీకాల మూడు రోజులలో ఒక రోజు నేను ఏదో పనిలో వున్నప్పుడు, ఒకాయన వస్తే, మా అమ్మమ్మ ప్రసాదం పెట్టి ఇస్తే, ఆయన బైటికి వెళ్లి తిని వెళ్లిపోయారని చెప్పారు. నాకు చాలా బాధవేసి, బాబా గారితో, "మీరు అలా బైటకూర్చుని తినడమేమిటి, ఇంట్లోవాళ్ళలాగా చక్కగా లోపల కూర్చుని తినాలిగాని" అని బాధపడ్డాను. మర్నాడు కార్యక్రమంలో చాలా హడావిడిగా వుండగా బక్కపల్చగావుండి, పంచె కట్టుకుని భుజాన కండువా వేసుకున్న ఒకాయన లోపలకి వచ్చి నన్ను భోజనం పెట్టమని అడిగారు. నేను పని హడావిడిలో వుండి వంటాయనతో, "అతనికి భోజనం యివ్వండి" అని చెప్పాను. వెంటనే ఆయన "నేనేం బిచ్చగాడిననుకున్నావా, బైటకూర్చుని తినడానికి? ఇదిగో యజ్ఞోపవీతం చూడు" అని ఆయన వేసుకున్న చొక్కాలోనించి బైటికి తీసి చూపించారు. నేను వెంటనే ఆయనని లోపలకి తీసుకెళ్లి, వారికి మడిగా వడ్డించమని ఒకరికి అప్పచెప్పి, నేను వేరే పని చూడటానికి వెళ్లాను. మళ్ళీ కాసేపటికి వచ్చి చూస్తే వారు వెళ్లి పోయారు. ఇప్పుడే భోజనం చేసి వెళ్లిపోయారని చెప్పారు. కానీ అక్కడివాళ్లు, ఆ ఊరివాళ్ళు, ఆ వ్యక్తిని ఎప్పుడూ చూడలేదని చెప్పారు. తరవాత నాకు అర్థం అయ్యింది.... నిన్న బాబాని అలా ప్రార్థించినందుకు, యీ రోజు యిలా వచ్చి ప్రసాదం తీసుకుని మమ్మల్ని, మా అమ్మని అనుగ్రహించారని!

మా బాబుకి 5 సంవత్సరాల వయసప్పుడు యేవో ఆరోగ్య సమస్యలు వచ్చాయి. వాడిని తీసుకుని ఆసుపత్రులవెంట తిరుగుతూ వుండేవాళ్ళం. చివరికి టీబీ పరీక్షలు చేయాలన్నారు. ఇది విని చాలా బాధపడ్డాము. సరేనని పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వెళ్ళినప్పుడు, మావారి దగ్గరికి పంజాబీ లాగా వున్న ఒకతను వచ్చి భుజం మీద చెయ్యి వేసి, ''భావూ, కుచ్ నహీ హోగా జీ" అని చెప్పి వెళ్లిపోయారట. నిజంగానే వాడికేమీ లేదని పరీక్షల అనంతరం తేలింది. తరవాత మావారు కూడా సాయి భక్తులైపోయారు.

ఇంతే కాదు, నేను శ్రీ సాయి లీలామృతములో చదివి, ఇలా జరుగుతుందా అని ఏ సన్నివేశం గురించైనా అనుకుంటే, వెంటనే స్వప్నంలో బాబా దానిని అనుభవింపచేసేవారు.

తరవాత శ్రీ సాయినాథులు, మమ్మల్ని గురుకుటుంబానికి అప్పగించి వారి రూపంలో లీలావినోదం చేస్తున్నారు. అటువంటి సమర్థ సద్గురునికి హృదయపూర్వక కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు సమర్పించుకుంటున్నాను.●

ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీ రావూరు గోపాల్

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని వారి పూర్వ విద్యార్థి, కలిచేడు వాస్తవ్యులైన రావూరు గోపాల్ గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

మా స్వగ్రామం కలిచేడు. నేను ఇంటరులో కాలేజీలో చేరటానికి విద్యానగరు వెళ్లాను. మాకు ఆంగ్లం బోధించటానికి పూజ్యశ్రీ మాస్టరుగారు అధ్యాపకులుగా వచ్చేవారు. వారి బోధనాదక్షత అద్భుతంగా వుండేది. మా వసతి గృహాలలో A, B విభాగాలుండేవి. అందులో A విభాగంలో కొంతమంది యువకులు సత్సంగం ఏర్పాటు చేసేవారు. అక్కడకు పూజ్యశ్రీ మాస్టరుగారు వచ్చేవారు. నేను B విభాగంలో వుండేవాడిని. సత్సంగాలు జరగడం చూస్తుండేవాడిని కానీ మొహమాటంవల్ల వెళ్ళేలేకపోయేవాడిని. మా ఇంట్లో భారత భాగవతాది గ్రంథాలు చదవడం అలవాటు. నేను నా తరగతి పుస్తకాలతో పాటు భగవద్గీత గ్రంథం కూడా చదివేవాడిని. అది చూసిన ఒక క్రైస్తవ విద్యార్థి ఎలీషా ఉదయకుమార్, "ఇవన్నీ మూఢనమ్మకాలు. వాటివల్ల ఏమీ ఉపయోగం లేదు" అని వాదించేవాడు. నాకు పూజ్యశ్రీ మాస్టరుగారిని చూశాక ఇతని ప్రశ్నలన్నింటికీ ఆయనే సరైన సమాధానాలు చెప్పగలరనిపించింది.

ఒకరోజు ఉదయం నేను, ఉదయ్ కుమార్,కరుణాకర్ అనేముగ్గురంకలిసి పూజ్యశ్రీ మాస్టరుగారి గదికి వెళ్ళాము. ఆయన ఆ సమయానికి బయటకు వెళుతున్నారు. మమ్మల్ని చూసి వచ్చిన కారణం అడిగారు. "మాకు భగవద్గీత గురించి కొన్ని సందేహాలున్నాయి సార్!" అంటే, సాయంత్రం హిల్-వ్యూ కాంటీను దగ్గరకు రమ్మన్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రతిరోజూ సాయంత్రం గూడలి రోడ్డులో హిల్-వ్యూ కాంటీన్ ఎదురుగా వున్న ఇసుక దిబ్బల మీద కూర్చుని విద్యార్థులతో చర్చలు చేసేవారు. మేము ఆ రోజు సాయంత్రం అక్కడకు వెళ్ళాము. ఎలీషా ఉదయకుమార్ సైన్సు విద్యార్థి. మేము అక్కడకు వెళ్ళగానే పూజ్యశ్రీ మాస్టరుగారు అతనిని పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగారు. అతను సరైన సమాధానాలు చెప్పలేకపోయాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "నీకు సంబంధించిన సైన్సులోనే సరైన సమాధానాలు చెప్పలేకపోయావు. మరి నీకు అవగాహనలేని ఆధ్యాత్మికత మీద ఏమి తెలుసని ఒక నిర్ణయానికి వచ్చావు? ఏదైనా ఒక విషయం తెలుసుకోవాలంటే దానికి సంబంధించిన సాహిత్యం అంతా కూలంకషంగా అధ్యయనం చేయాలి. అవగాహన చేసుకోవాలి. అనుభవం పొందిన మహాత్ముల దగ్గరకు వెళ్లి సందేహాలు అడిగి తెలుసుకోవాలి. అలాంటి కృషి ఏమీ చేయకుండా వాదిస్తే ఉపయోగం లేదు. సత్యాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస వున్నప్పుడు వాదన చేయవచ్చు. అంతేకాని అవతలి వ్యక్తిని ఓడించాలన్న ఉద్దేశంతో మాట్లాడకూడదు" అని చెప్పారు. నాకు అదే మొదటిసారి అటువంటి ఆధ్యాత్మిక చర్చ వినడం. నాకు వెంటనే శంకరవిజయంలో ఆదిశంకరులు మండనమిశ్రునితో (అవతలి వ్యక్తి అంతటి వాడు కాదు కానీ) చేసిన వాదన గుర్తొచ్చి వారు సాక్షాత్తు ఆదిశంకరాచార్యులుగా అనిపించారు.

కలిచేడులో ప్రతి సంవత్సరమూ గీతాజయంతికి పండితులచేత గీతోపన్యాసాలు చేయిస్తూ వుంటారు.

నాకు మనసులో ఆ సంవత్సరం పూజ్యశ్రీ మాస్టరుగారితో ఆ ఉపన్యాసాలు చేయించాలని కోరిక. కానీ మా ఊరివాళ్ళు మరొకరిని ఆహ్వానించారు. కాని ఆ ఉపన్యాసకునికి ఏదో ఆటంకం వచ్చి రాలేనన్నారు. వెంటనే నన్ను ప్రక్క గ్రామంలో వున్న ఒక ఆశ్రమానికి వెళ్ళి అక్కడి స్వామీజీని ఉపన్యసించడానికి పిలువమన్నారు. నేను వెళ్ళి విషయం చెప్పగానే, "కారు తెస్తావా?" అనడిగారు ఆ స్వామీజీ. "లేదు స్వామీ! మాతో బస్సులో తీసుకుపోతాము" అని చెప్పగానే ఆయన రానని చెప్పారు. నేను పూజ్యశ్రీ మాస్టరుగారి అనుమతి తీసుకోకుండానే మా ఊరివారితో, "మా కళాశాలలో ఒక అధ్యాపకులున్నారు. ఆయన చాలా బాగా ఉపన్యాసాలివ్వగలరు. వారిని తీసుకువస్తాను" అని చెప్పాను. మావాళ్ళు, "అయితే ఎలా అయినా ఆయనను తీసుకురా!" అని చెప్పారు. "తప్పక వస్తారు" అని చెప్పాను. నాకు అప్పుడు అంత బలంగా ఎందుకు నమ్మకం కలిగిందో నాకే తెలియలేదు. మా ఊరివాళ్ళకి కూడా ఆయన బోధ రుచి చూపించాలన్నదే నా తపన. అదేవిధంగా వారి దగ్గరకు వెళ్ళి విషయం చెప్పాను. "నన్ను తీసుకువస్తానని మాటిచ్చావా?" అన్నారు. "ఇచ్చాను మాస్టరుగారూ!" అన్నాను. "అయితే సరే, ఏ రోజు?" అనడిగారు. చెప్పాను. నేనే వచ్చి తీసుకువెళతానని కూడా చెప్పాను. "మాస్టరుగారూ! కరపత్రంలో మీ పేరు వేసుకోవచ్చా?" అనడిగాను. "పేరు వేసుకో గాని విద్యార్హతలు (డిగ్రీ or క్వాలిఫికేషన్స్) వెయ్యకు!" అని చెప్పారు. ఆయన ఉన్నతమైన వ్యక్తిత్వానికి నా కళ్ళు చెమర్చాయి. నేనెంతటివాడిని? ఇంటరు చదివే విద్యార్థిని. ఆయన నా మాటకు అంత విలువనిచ్చి అడిగిన వెంటనే ఒప్పుకోవడం! ఆయన ఎదుటి వ్యక్తిని ఎంత సంస్కారంగా చూస్తారోనన్నది అర్థమైంది. ఆయనది మహోన్నతమైన వ్యక్తిత్వం.

నా పూర్వజన్మ సుకృతం కొద్దీ పూజ్యశ్రీ మాస్టరుగారు కలిచేడులో ఉపన్యాసం చెప్పిన రెండు రోజులూ మా ఇంట్లోనే వున్నారు. మొదటిరోజు ఉపన్యాసమయ్యాక అక్కడకు వచ్చిన ఒక సాధువు మా ఇంటికి పూజ్యశ్రీ మాస్టరుగారితో పాటే వచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారు కుర్చీలో కూర్చుంటే, ఆయన వారి పాదాల వద్ద క్రింద కూర్చున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు వారిని పైన కూర్చోమని, లేకుంటే తామే క్రింద కూర్చుంటామని అన్నారు. వెంటనే ఆ సాధువుగారు, "మీరు పూజ్యనీయులు, పైనే కూర్చోవాలి!" అని పాదాభివందనం చేశారు. తరవాత పూజ్యశ్రీ మాస్టరుగారు నాతో, "నేను సిగరెట్ కాలిస్తే మీవాళ్ళకి ఏమైనా అభ్యంతరమా?" అనడిగారు. "ఫర్వాలేదు మాస్టారూ! మీరు కాల్చుకోండి" అన్నాను. మా నాన్న మాత్రం కొంచెం గొణిగేవాడు.

పూజ్యశ్రీ మాస్టరుగారు కలిచేడులోని మా ఇంటికి రెండు, మూడుసార్లు వచ్చారు. రెండవసారి వచ్చినప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు అద్భుతమైన లీల చేశారు. వారు మా ఇంటి వరండాలో కుర్చీలో కూర్చుని సిగరెట్ కాల్చుకుంటున్నారు. మా నాన్న బయటనుంచి ఇంటిలోకి వస్తూ వరండాలోకి రాగానే పూజ్యశ్రీ మాస్టరుగారు కూర్చునివున్న చోట శ్రీ సాయిబాబా ఆశీనులై కనిపించారట! అప్పుడు మా నాన్నకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంత గొప్పవారో అర్థమై, "ఒరేయ్ గోపాల్! ఎంత గొప్ప మహాత్ముడిని తీసుకువచ్చావురా మన ఇంటికి?! మేమంతా తరించిపోయాం రా!" అన్నారు.

విద్యానగరు మందిర కుంభాభిషేకానికి మేమందరం తలొక పనీ చేస్తున్నాం. రాత్రి అందరూ తలొక చోటా పడుకున్నారు. నేను మందిరంలో నిద్రపోతున్నాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు స్వప్నదర్శనమిచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారు నా ఎదురుగా కూర్చున్నారు. నాతో "గోపాల్, సాధన చేసేవారికి కత్తి చాలా అవసరమోయ్!" అన్నారు. నేను, "కత్తి అవసరం ఎందుకుంటుందండీ? కత్తితో కూరగాయలు తరుగుతాం లేదా ఏదైనా చీల్చడానికి ఉపయోగిస్తాం. అది మనకెందుకు?" అన్నాను. "కాదోయ్, అవసరం!" అన్నారు. ఈవిధంగా ఇద్దరికీ చర్చ జరుగుతోంది. ఇంతలో మెలకువ వచ్చింది. మర్నాడు పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వెళ్ళి, "సార్ ఇలా కల వచ్చింది, దాని అర్థమేమి" టని అడిగితే, "కత్తి అంటే వివేకమోయ్!" అన్నారు. ఐహికమైన బంధాలు, అనవసరమైన విషయాలు ఖండించడానికి వివేకమనే కత్తి అవసరమని ఆయన చెప్పారు.

ఇంకొకసారి స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారిని, "మీకు ఇంతమంది శిష్యులున్నారు కదా, వారిలో ఉత్తమమైనవాళ్ళు ఎవరు సార్? అనడిగితే, పూజ్యశ్రీ మాస్టరుగారు పూజ్యశ్రీ అమ్మగారిని చూపించారు. అమ్మగారు అంతటి మహనీయురాలని

అప్పుడర్థమైంది!

నేను ఇంటర్ పూర్తిచేసుకుని మా ఊరు వెళ్ళి మైన్స్ లో ఉద్యోగంలో చేరాను.

పూజ్యశ్రీ మాస్టరుగారి రూపం ముగ్ధమనోహరంగా వుండేది. ఒక్కసారి చూసిన వారెవ్వరూ ఆ రూపాన్ని మర్చిపోలేరు. నేను కలిచేడులో పగలంతా పనులలో వున్నా రాత్రి నిద్రపోయేటప్పుడు నేనొక్కడ్నే ఆరుబయట అందరికీ దూరంగా మంచం వేసుకుని పడుకుని పూజ్యశ్రీ మాస్టరుగారి రూపాన్ని తలచుకుంటూ స్మరణ చేసుకునేవాడిని. నా ప్రమేయం లేకుండానే ఆనందభాష్పాలు కారిపోయేవి. తరవాత తరవాత రాత్రిపూటే కాకుండా పగటిపూట కూడా ఆయన స్మరణ ఆనందదాయకంగా వుండేది. ఒకసారి నాకొక అనుమానం వచ్చింది, 'నేను ఇలా స్మరించుకుంటున్నట్లు వారికి తెలుస్తుందా?' అని! కొన్నాళ్ళకి పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు ఒక విద్యార్థి వెళితే, "గోపాల్ నన్నేమైనా చూడాలనుకుంటున్నాడా?" అని అడిగారట! ఇలా నాకు ఎన్నో నిదర్శనాలు, స్వప్నదర్శనాలు, అనుభవాలూ ప్రసాదించారు.

థామస్ రెడ్డితో, "ఏదైతే శూన్యమో అదే నన్నుగా భావించు!" అన్నారు పూజ్యశ్రీ మాస్టరుగారు. ఒకసారి నా ఉద్యోగరీత్యా బయట ఊరికి వెళ్ళి తిరిగివచ్చేటప్పుడు మా ఆఫీసువారు నన్ను ఒక మూడురోడ్ల కూడలిలో వదిలేసి, అక్కడినుంచి ఏదైనా వాహనం ఎక్కి వెళ్ళమని చెప్పారు. అప్పటికే సంధ్యా సమయం దాటిపోతోంది. అక్కడ నిర్మానుష్యంగా వుంది. ఎంతసేపు ఎదురుచూసినా ఎవరూ రావడం లేదు. కనీసం వాహనాలు కూడా రావడం లేదు. నేను నిత్యం, 'ఓం ఆచార్య భరద్వాజ గురుదేవ!' అన్న నామం జపించుకుంటూ వుంటాను. ఈ శూన్యం అంతా మీరే అన్నారు కనుక, అది నిరూపించి నన్ను కాపాడమని ప్రార్థిస్తూ నామస్మరణ చేసుకుంటున్నాను. ఐదు నిముషాలలో ఒక అబ్బాయి బండిమీద వచ్చి నా ముందు ఆగి, "ఎక్కడికి వెళ్ళాలి?" అనడిగాడు. నేను చెప్పాను. "మిమ్మల్ని నెల్లూరులో దించుతాను. అక్కడనుంచి బస్సులో వెళ్ళండి!" అన్నాడు. ఆ క్షణంలో జరుగుతున్న లీలలో పూజ్యశ్రీ మాస్టరుగారి అపారకరుణకు కళ్ళు చెమర్చాయి. 'మాదే ఆలస్యం కానీ పిలిచిన వెంటనే పలకడానికి మీరు ఎప్పుడూ సిద్ధంగానే వుంటారు మాస్టారూ!' అనుకున్నాను.

ఇలాగే ఇంకొకసారి ఒక సంచిలో చాలా బరువు పెట్టుకుని బెంగుళూరు బస్టాండులో దిగాను. వంతెన దాటి అటుపక్కకి పోవాలి. ఆ సంచి చాలా బరువుగా వుంది. సంచిని క్రిందపెట్టి ఆలోచిస్తూ వున్నాను. ఈలోపు ఒకబ్బాయి వచ్చి, 'ఎక్కడకి పోవాలి?" అనడిగాడు, చెప్పాను. ఒక్క మాట కూడా మాట్లాడకుండా సంచి పట్టుకుని ముందుకు నడుస్తున్నాడు. అతని వెనుకనే నేనూ వెళుతున్నాను. వంతెన దిగాము. నేను ఎక్కవలసిన బస్సు దగ్గరకు వెళ్ళాము. అతను ఆ బస్సెక్కి, ఆ సంచిని అందులో పెట్టి, వెనుకకు తిరిగిచూడకుండా వెళ్ళిపోయాడు! నాకు నోట మాట రాలేదు. ఇలా ఎన్నో ఎన్నెన్నో!!

పూజ్యశ్రీ మాస్టరుగారు వారి స్వస్వరూపాన్ని గుప్పెట మూసి వుంచేవారు. అయినప్పటికీ, వారి సహజ స్వరూపం కొన్ని కొన్ని సందర్భాలలో బహిర్గతమయ్యేది. ఒకసారి అన్నారు, "నేను అంతటా, అందరిలో సాయిని చూస్తాను. కానీ ప్రత్యేకంగా భౌతికరూపంలో సాయినాథుని చూడాలని ఎన్నడూ కోరుకోను. ఎందుకంటే అలా చూస్తే, ఆ రూపంలో మాత్రమే సాయి వున్నాడన్న భ్రాంతి కలుగుతుంది. నా హృదయమే సాయినాథుడు!" అన్నారు. అది వారి ఆచరణలో అక్షరసత్యమైన మాట. అందరిలో సాయిని చూడగలిగారు. కనుక అందరితో అంతులేని ప్రేమతో వుండేవారు. క్రిందటి సంవత్సరం ఒక స్వప్నంలో, "అందరూ నేను తాగే సిగరెట్లను, వేసుకునే దుస్తుల్ని బట్టి అంచనా వేస్తారు. నిజానికి నా హృదయం ఎటువంటిదో ఎవరూ తెలుసుకోలేరు. నా హృదయం ఎలాంటిదో మీకు తెలుసా? సమస్త ప్రాణికోటిలో 'నేను' అన్న అహం స్ఫురణ ఏదైతో వున్నదో అదే నేను!" అన్నారు. అది విన్న తరువాత నాకు కలిగిన ఆనందానికి అంతేలేదు. ఇది నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు యిచ్చిన సందేశమనిపించింది. అంతేకాదు. అలా ప్రయత్నం చేస్తూవుంటే మనలో రాగద్వేషాలు తొలగి, మనం కూడా అంతులేని శాంతిని పొందవచ్చనిపిస్తుంది. ఆ దిశగా నా ప్రయాణం సాగాలని పూజ్యశ్రీ మాస్టరుగారు కోరుకునే చక్కటి దృక్పథం జీవితంలో ఏర్పడాలని మనసారా కోరుకుంటూ, వారి చరణాలకు అంజలి ఘటిస్తున్నాను.●

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

SRI GURUPADUKA PUBLICATIONS, C/o.SRI MANGA BHARADWAJA TRUST

Regd.Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68.
Phone: +91 - 74160 41550

Branch Office : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh.
Phone:08592 233271

Send DD in favour of **"Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad or Ongole.**

శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర (Bound)	450-00
శ్రీ సాయి లీలామృతం	150-00
శ్రీ గురు చరిత్ర	150-00
శ్రీ సాయి సన్నిధి	120-00
శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు	125-00
శ్రీ సాయినాథ ప్రభోధామృతము	80-00
సాయినాథ పూజ	40-00
సాయినాథ స్థవనమంజరి	10-00
శిరిడి ఆరతులు	15-00
సాయిబాబాను సేవించడమెందుకు	10-00
సత్సంగము - భజన	5-00
శిరిడి క్షేత్ర సందర్శనము	40-00
విజ్ఞాన వీచికలు	99-00
పరిప్రశ్న	99-00
మతమెందుకు?	20-00
ఏది నిజం?	25-00
ధ్యానయోగ సర్వస్వం	99-00
బుద్ధధ్యాన హృదయం	49-00
దత్తావతార మహత్త్వం	75-00
సంహితాయన గురు ద్విసాహస్రి	125-00
పురుషసూక్త రహస్యం	40-00
సాయిసూక్తి - ఆచార్యవాణి	10-00
శ్రీ పాకలపాటి గురువుగారు	49-00
అవధూత శ్రీ చీరాలస్వామి	49-00
అవధూత శ్రీ వెంకయ్యస్వామి	70-00
శ్రీ ఆనందమాయి అమ్మ	49-00
టిబెట్ యోగి మిలారేపా చరిత్ర	80-00
శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర	49-00
స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి)	49-00
మనము - మన సంస్కృతి	70-00

ఇతర ప్రచురణలు

మహాత్ముల ముద్దుబిడ్డడు	120-00
అవధూత చివటం అమ్మ	70-00
శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర	70-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-1	125-00
మరో నందదీపం	80-00
ఆచార్య అమృత లేఖావళి	40-00
భగవాన్ శ్రీ భరద్వాజ	175-00
బాలల శ్రీ సాయి లీలామృతము	25-00
మహాపురుషుడు	50-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-2	125-00
బాలల శ్రీ సాయి సన్నిధి	50-00
బాలల శ్రీ గురు చరిత్ర	50-00
శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము	15-00
మాష్టారు అమృత వాక్కులు	100-00

BOOKS IN ENGLISH

Sai Baba the Master	175-00
Sree Guru Charitra	99-00
Supreme Master (Swami Samartha)	99-00
Sai Baba of Shiridi and His Teachings	99-00
Life and Teachings of Hazarat Tajuddin Baba	99-00
Children's Sai Baba the Master	60-00

BOOKS IN OTHER LANGUAGES

Sadguru Sai Baba (Hindi)	150-00
Sai Leelamrutham (Kannada)	150-00
Sai Baba Jeevitha Charitham (Malayalam)	220-00
Sai Baba Leelamrutham (Tamil)	175-00
Sri Guru Charitra (Hindi)	99-00
Swami Samartha (Kannada)	50-00
Sri Guru Charitra (Kannada)	99-00
Shiridi Aarathi (Tamil)	15-00
Stavana Manjari (Tamil)	10-00
Tibet Yogi Milarepa Jeevitha Charitra (Kannada)	55-00
Sri Sainath Prabodhamruthamu (Kannada)	65-00
Sai Sannidhi (Kannada)	120-00
Sri Guru Charitra (Malayalam)	150-00
Sri Guru Charitra (Oriya)	150-00

మార్చి 6, 2023 సోమవారం

ఉదయ కార్యక్రమములు

గం. 5.30 – పూజ్యశ్రీ మాస్టరుగారికి మరియు పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపు సేవ,
విడిది గృహమునకు ఆహ్వానించుట.
గం. 6.00 – శ్రీ సాయిబాబా కాకడ ఆరతి
గం. 7.30 – పూజ్యశ్రీ అమ్మగారి సమాధి అభిషేకము, ప్రత్యేక అలంకరణ.
గం. 8.30 – అల్పాహార నైవేద్య సేవ.
గం. 9.00 – ప్రసాద వితరణ.
గం. 9.30 – శ్రీ సాయినాథుని సన్నిధిలో, మహాత్ముల సమక్షంలో, వేద మంత్రాలతో,
పూజ్య గురు దంపతుల లీలా కల్యాణ మహోత్సవ వైభవము.
గం. 2.00 – భోజన ప్రసాద వితరణ

సాయంకాల కార్యక్రమములు

గం. 6.00 – శ్రీ బాపట్ల సత్సంగ సభ్యులచే 'శ్రీ అలివేలుమంగా సమేత భరద్వాజ మహారాజ్ ల కల్యాణ
మహోత్సవం' అను బుర్రకథ.
గం. 9.00 – శేజ్ హారతి.
గం. 9.30 – ప్రసాద వితరణ.

మార్చి 7, మంగళవారం

గం. 5.30 – పూజ్యశ్రీ మాస్టరుగారికి మరియు, పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపు సేవ,
విడిది గృహమునకు ఆహ్వానించుట.
గం. 6.00 – శ్రీ సాయిబాబా కాకడ ఆరతి.
గం. 7.30 – పూజ్యశ్రీ అమ్మగారి సమాధి అభిషేకము, ప్రత్యేక అలంకరణ.
గం. 8.30 – అల్పాహార నైవేద్య సేవ.
గం. 9.00 – ప్రసాద వితరణ.
గం. 9.30 – 'పూజ్యశ్రీ మాస్టరుగారి బోధ – నిత్యజీవితం' అను అంశంపై సద్గోష్ఠి.
మ॥ గం.1.00 – కార్యక్రమముల ముగింపు,
భోజన ప్రసాద వితరణ.

కళ్యాణ మహోత్సవమునకు విచ్చేయు భక్తులకు వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయబడినవి.
వివరములకు :- శ్రీ టి.వి. రావు గారు (9063334964).

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.

శ్రీ శ్రీ శ్రీ అలివేలు మంగా సమేత భరద్వాజ గురుదేవుల కళ్యాణ మహోత్సవాన్ని తిథి ప్రకారము ఫిబ్రవరి 15వ తేదీన అనేక ప్రాంతాలలో భక్తులు ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

హైదరాబాదు

చీరాల



కావలి

పామూరు

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.